జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php



ప్రజాపాలన దినపత్రికలో

పుట్టినరోజు / ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు రూ. 500

కోర్టు నోటీసులు / పబ్లిక్/ కంపెనీస్ నోటీసులు రూ. 600

Contact : 8886022523, 9000621111, 9948725373




సంపుటి 16 సంచిక 73 విశాఖపట్నం శనివారం 04 నవంబరు 2023 8 పేజీలు వెల : 5.00


## జగన్ కేసుల విచారణలో

# జాప్యం దేనికి..?

## సీబీఐను ప్రశ్నించిన సుప్రీంకోర్టు..

న్యూఢిల్లీ, : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై కొనసాగుతున్న కేసుల విచారణలో ఎందుకు జాప్యం జరుగుతోంది అంటూ సుప్రీంకోర్టు దర్యాప్తు సంస్థ సీబీఐని ప్రశ్నించింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ రఘురామకృష్ణం రాజు దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం విచారణ జరిపిన జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎస్వీఎన్ భట్టితో కూడిన ధర్మాసనం, ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ జనవరికి వాయిదా వేసింది. ఈ సందర్భంగా పిటిషనర్ రఘురామకృష్ణ రాజును ప్రతిపక్ష పార్టీ నేతగా ధర్మాసనం భావించగా.. ఆయన తరపు న్యాయవాది ఒకే పార్టీకి చెందిన నేత అంటూ వివరించారు. జగన్ కేసుల విచారణను వేరే రాష్ట్రానికి బదిలీ చేయాలంటూరఘురామ ఈ పిటీషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం తెలంగాణ సీబీఐ కోర్టులో జగన్ కేసులపై విచారణలో విపరీతమైన జాప్యం జరుగుతోందని పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఈ కేసు 3,071 సార్లు వాయిదా పడిందని తెలిపారు. జగన్ ప్రత్యక్ష హాజరుకు కూడా సీబీఐ కోర్టు మినహాయింపునిచ్చిందని తెలిపారు. వందల కొద్దీ డిశ్చార్జి పిటీషన్లు వేశారని, కేసు విచారణ మరింత జాప్యం జరిగే అవకాశం ఉందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో వేరే రాష్ట్రానికి



కేసుల విచారణ బదిలీ చేసి విచారణ వేగంగా ముందుకు సాగేలా ఆదేశాలివ్వాలని రఘురామ తన పిటిషన్‌లో అభ్యర్థించారు.

# ఈ నెల 20 నుండి కులగణన

## ప్రతి జర్నలిస్ట్‌కు 3 సెంట్ల స్థలం



అమరావతి: ఏపీలోనూ పొలిటికల్ హీట్ అందుకు ధీటుగా మాంచి వేడిమీద సాగుతోంది. రానున్న ఎన్నికల కోసం రాజకీయ వ్యూహం రెడీ అవుతోంది. ఎవరి లెక్కలు వాళ్లవే.. మొత్తానికి కీలక సమయంలో ఏపీ కేబినెట్ భేటీ కీలకంగా మారింది. ఏపీలో కులగణనకు ఏపీ సర్కార్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. రాష్ట్రంలో ప్రజలందరినీ ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరంగా అభివృద్ధి చేయాలనేదే లక్ష్యం అంటుంది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం. ఇంద కోసం కులాల వారీ లెక్కలు తీయడం ఒక్కటే మార్గం అంటుంది. అందుకే సమగ్ర కులగణనకు శ్రీకారం చుడుతుంది సర్కార్. ఇప్పటికే దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా సంక్షేమం అందిస్తున్న రాష్ట్రంగా చెబుతున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, కులాల వారీ లెక్కలు తేల్చాలని నిర్ణయించింది. ఇప్పటికే కులగణన కోసం గత అసెంబ్లీ సమావేశాల్లో తీర్మానం చేసి కేంద్రానికి పంపింది ఏపీ ప్రభుత్వం. మరోవైపు ఇతర రాష్ట్రాల్లో కులగణన ఏవిధంగా జరిగిందో అధ్యయనం చేసేందుకు అధికారుల కమిటీని కూడా నియమించింది. ఇప్పటికే ఈ కమిటీ ప్రభుత్వానికి నివేదిక అందించింది. కమిటీ నివేదిక ఆధారంగా కులగణన ఏ రకంగా చేపట్టాలనే దానిపై సర్కార్ విధివిధానాలు సిద్ధం చేస్తుంది.

92 ఏళ్ల తర్వాత కులాల వారీ లెక్కలు తీస్తున్న సర్కార్ దేశంలో చివరిసారిగా 1931లో సమగ్ర కులగణన చేపట్టారు. అప్పటి నుంచి ఉన్న లెక్కల ప్రకారమే రిజర్వేషన్లు కానీ, సంక్షేమ పథకాలు కానీ, కులాల వారీగా ఉన్న జనాభాను గానీ అంచనా వేసుకుంటూ వస్తున్నారు. దీంతో అట్టడుగు, బలహీన వర్గాలకు పథకాలు మెరుగ్గా అందడం లేదనేని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వాదన. అప్పటి నుంచి సమగ్రమైన లెక్క లేదని చెబుతుంది. అందుకే కులగణన చేపట్టాలని నిర్ణయించింది. దీని ద్వారా అణగారిన వర్గాలకు మరింత భద్రత కల్పించవచ్చుంటుంది. కులాల వారీ లెక్కలు తేలితే, ఏ కులం ప్రజలు ఇంకా ఎక్కడెక్కడ వెనుకబడి ఉన్నారు, వారిని ఏ రకంగా అభివృద్ధి చేయాలనేది స్పష్టత వస్తుందని ప్రభుత్వం చెబుతుంది. ఈ నేపథ్యంలోనే ఈనెల 20 తర్వాత నుంచి కులగణన ప్రారంభించేలా చర్యలు తీసుకుంటుంది. దీనికోసం రాష్ట్ర వ్యాప్తంగా ఐదు ప్రాంతాల్లో రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించనుంది ప్రభుత్వం.

(మిగతా 3లో..)

## నీళ్లు లేక రైతులు తీవ్రంగా నష్టపోయారు



నంద్యాల: ఖరీఫ్ సీజన్‌లో నీళ్లు లేక పంటలు వేసి రైతులు తీవ్రంగా నష్టపోయారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. శుక్రవారం నాడు నంద్యాల శివారులో పొన్నాపురం కేసీ కెనాల్ కాల్వను పరిశీలించారు. అక్కడ ఉన్న రైతులతో పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ మీడియాతో మాట్లాడుతూ...తెలంగాణ ఎన్నికల కోసం కేంద్రం నీటి పంపకాల్లో ఏపీకి చాలా అన్యాయం చేస్తుంది. నష్టపోయిన రైతులను కేంద్ర సహకారంతో ప్రభుత్వం అదుకోవాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

## ఎంఐడీసీ కంపెనీలో భారీగా మంటలు... నలుగురు మృతి




రాయగఢ్: మహారాష్ట్రలోని రాయగఢ్ జిల్లా మహద్ మహారాష్ట్ర ఇండస్ట్రియల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏరియాలోని ఒక కంపెనీలో శుక్రవారంనాడు మధ్యాహ్నం 11 గంటల ప్రాంతంలో భారీ అగ్నిప్రమాదం చెలరేగింది. మంటలు ఒక్కసారిగా చెలరేగడంతో దట్టమైన పొగలు చుట్టపక్కలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో నలుగురు మృతిచెందగా, ఐదుగురు గాయపడ్డారు. మరో 15 మంది జాడ ఇంకా తెలియలేదు. సమాచారం తెలిసిన వెంటనే ఐదు అగ్నిమాపక శకటాలు హుటాహుటిన అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేస్తున్నాయి. కాగా, ప్రమాదం జరిగిన వెంటనే పెద్ద శబ్దం వినిపించిందని చెబుతున్నారు. కంపెనీలో గ్యాస్ లీక్ అయినట్టు కూడా తెలుస్తోంది. ప్రాథమిక సమాచారం ప్రకారం పలువులు వర్కర్లు కంపెనీలో చిక్కుకుపోయారు. అయితే, ప్రమాదానికి ఇతమిత్థమైన కారణం ఏమటనేది అధికారులు ఇంకా నిర్ధారించలేదు.

## గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణ పనుల్లో

# మరో ముందడుగు..

### ప్రత్యేక పూజలు చేసి మరీ ప్రారంభించిన జీఎంఆర్ దంపతులు

విశాఖ, నవంబర్ 03: ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల కోరిక భోగాపురం ఎయిర్ పోర్ట్ - పనులను ఈనెల 1 వ తేదీన జీ ఎం అర్ దంపతులు ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. ఈ ఎయిర్ పోర్ట్ నిర్మాణం పూర్తయితే ఎయిర్



పాసింజర్ల కు మాత్రమే కాకుండా, ఈ ప్రాంతం మొత్తం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందన్న భావన ఉత్తరాంధ్ర మొత్తం ఉంది. ముఖ్యంగా విశాఖ, శ్రీకాకుళం, విజయ నగరం జిల్లాల స్వరూపం పూర్తిగా మార్చే శక్తి భోగాపురం ఎయిర్ పోర్ట్ కు ఉందని ఈ ప్రాంత వాసులు బలంగా నమ్ముతారు. భూముల విలువ పెరుగుతాయని, సర్వీస్ సెక్టార్ పెరుగుతుందని, విస్తారంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయన్న ఆశతో ఉన్న వాళ్ళు ఎందరో ఉన్నారు. ఇంతలా ఎదురుచూస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక ఈ భోగాపురం ఎయిర్ పోర్టు నిర్మాణాన్ని జీఎంఆర్ గ్రూపుకు అప్పగించడం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఈ ఏడాది మే 3 న శంకుస్థాపన కూడా చేసేశారు. ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్య పద్ధతిలో ఈ నిర్మాణ కాంట్రాక్ట్ ను చేజిక్కించుకున్న జీఎంఆర్ నవంబర్ 1 న పనులు ప్రారంభించింది. దేశ, విదేశాల్లో ఎయిర్ పోర్టులు అభివృద్ధి చేసిన అనుభవం ఉన్న జీఎంఆర్ సంస్థ మూడేళ్లలో దీని నిర్మాణం పూర్తి చేయడానికి ప్రణాళిక రచించి అమలులోకి దిగింది. (మిగతా 5లో..)

## క్లోరిన్ గ్యాస్ లీకేజీ వీడియో..

### పరుగులు తీసిన విద్యార్థులు



మధుర: మన చుట్టు పరిసరాల్లో అప్పుడప్పుడు కొన్ని గ్యాస్ లీకేజి సంఘటనలు జరుగుతూ ఉంటాయి. కొన్ని చోట్ల తీవ్ర స్థాయిలో ప్రాణ నష్టం సంభవిస్తే మరి కొన్ని చోట్లు అస్వస్థతుకు గురవుతూ ఉంటారు. గతంలో ఏపీలో కూడా కొన్ని చోట్ల పరిశ్రమల నుంచి గ్యాస్ లీకేజీ సంఘటనలు చాలా సార్లు చోటు చేసుకున్నాయి. ఇలాంటి సంఘట నే ఉత్తర్‌ప్రదేశ్లోని మధురలో చోటు చేసుకుంది. ఛీఫ్ మెడికల్ ఆఫీసర్ కార్యాలయంలోని ఆవరణలో దట్టమైన క్లోరిన్ గ్యాస్ లీకైంది. దీంతో చాలా మంది స్పృహ తప్పి పడిపోయారు. కొందరికి వాంతులు కాగా మరి కొందరు నిలకడగా ఉన్నట్లు తెలుస్తోంది. దీనిపై మరిన్ని విషయాలు ఇప్పుడు చూద్దాం. మధుర సీఎంఓ కార్యాలయంలో క్లోరిన్ గ్యాస్ లీకేజ్ జరిగింది. శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడుతున్న నర్సింగ్ విద్యార్థులు. ఈ సంఘటన నర్సింగ్ విద్యార్థులు మరియు సిబ్బందిని భయాందోళనలకు గురిచేసింది. ఉత్తరప్రదేశ్‌లోని మధుర చీఫ్ మెడికల్ ఆఫీసర్ క్యాంపస్‌లో శుక్రవారం క్లోరిన్ గ్యాస్ లీకేజీ ఘటనతో చాలా మంది పరుగులు తీశారు. ఇందులో 10 మంది నర్సింగ్ విద్యార్థులు స్పృహ తప్పి పడిపోయారు. వారిని ఆసుపత్రిలో చేర్పించి మెరుగైన చికిత్స అందిస్తున్నారు. క్యాంపస్ ఆవరణలో చాలా మంది నర్సింగ్ విద్యార్థులు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతున్నారు. స్టోరేజీ సిలిండర్ నుంచి క్లోరిన్ గ్యాస్ లీక్ అయింది. ఇలాంటి ఘోర ప్రమాదాల గురించి ఆందోళనల చెందుతున్నట్లు అక్కడి స్థానికులు తెలిపారు. (మిగతా 3లో..)

## ఈనెల 20 న విజయవాడ వేదికగా

## ఆల్ తెలుగు ప్రజా పార్టీ జనరల్ బాడీ మీటింగ్...



విజయవాడ (ప్రజాపాలన ప్రతినిధి):బహుజన రాజ్యం లక్ష్యంగా పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో వస్తున్న నూతన రాజకీయ పార్టీ "ఆల్ తెలుగు ప్రజాపార్టీ" జనరల్ బాడీ మీటింగ్ ఈనెల 20 న విజయవాడ, గాంధీనగర్ లోని వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయంలో జరగనున్నట్లు ఆల్ తెలుగు ప్రజాపార్టీ నేషనల్ ప్రెసిడెంట్ శివ భాగ్య రావు ఐ ఆర్ ఎస్ వి ఆర్ ఎస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఎజెండాగా పార్టీ మేనిఫెస్టో, పార్టీ ప్రకటన ,పోటీ చేసేవారి నిర్ణయం,సంబంధిత కమిటీల,ఇతర ముఖ్యమైన విషయాలు గురించి చర్చించటం కోసం పార్టీ ముఖ్య కార్యవర్గ సభ్యులు చర్చించనున్నట్లు ఆయన తెలిపారు. సమావేశానికి హాజరయ్యే వారు ముందస్తుగా అప్పారావు యాదవ్ కి ం91 94401 37451 తెలియపరచ వలసిందిగా ఆయన సభ్యులను కోరారు.

## కేసీఆర్ ఏపీ అభివృద్ధిపై పచ్చి అబద్ధాలు చెప్తున్నారు




అమరావతి: తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఏపీ అభివృద్ధిపై అబద్ధాలు చెపుతున్నారని మంత్రి, కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. గురువారం నాడు మంత్రి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ..."ధనిక రాష్ట్రాన్ని తెలంగాణను వదిలి చంద్రబాబు వల్ల ఏపీకి వచ్చేశాం. కరోనా సమయంలో తెలంగాణ కన్నా ఏపీలో హాస్పిటలల్లో వైద్యం బాగా చేశారు అన్నారు. కేసీర్ తెలంగాణలో డబుల్ రోడ్ ఉంటే ....సింగిల్ రోడ్ వచ్చిందంటే ఏపీ అన్నారు. ధాన్యం సొమ్ము తాము కొనుగోలు చేసిన... ఒకటి రెండు రోజుల్లో రైతులకు నగదును అకౌంట్‌లలో వేశాము. ఏపీలో ఆలస్యం అవుతోంది అని కేసీఆర్ అబద్ధాలు చెపుతున్నారు. మేము ధాన్యం కొనుగోలులో ముందున్నాం. అదేదో ఏపీ ధాన్యం మొత్తం మీరు కొంటున్నట్టు చెప్పుకుంటున్నారు. కరోనా సమయంలో ప్రజలను కేసీఆర్ గాలికి వదిలి ఫామ్ హౌస్‌లో పడుకున్నారు. ఏపీలో కరోనాను ధీటుగా ఎదుర్కొన్నాం. తెలంగాణలో బడిపిల్లాలను ఏం చేశారు...ఏపీలో చదువులో విప్లవాత్మక మార్పు తెచ్చాం. ఏపీ చదువులో మూడో స్థానంలో ఉంది" అని మంత్రి, కారుమూరి నాగేశ్వరరావు తెలిపారు.

**వైసీపీ హయాంలో పేదరికం గణనీయంగా తగ్గింది: మంత్రి నాగేశ్వరరావు**

"హైదరాబాద్‌లో పిల్లలు నాళాల్లో పడి కొట్టుకు పోతుంటే ఏమి చేస్తున్నారు. ఏపీలో మా ప్రభుత్వం వచ్చాక పేదరికాన్ని గణనీయంగా తగ్గించేశాం. మీరు ఇప్పుడు తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ సెంటిమెంట్ తెస్తే ఉపయోగం ఉండదు. మా ధాన్యంకు మేమే 3 రోజుల్లో కొన్నాం. కొన్ని చోట్ల ఒక రోజుల్లోనే చెల్లింపులు చేశాం. మీ ఎన్నికల గురించి మీరు మాట్లాడుకొండి మా గురించి మీకెందుకు..? హైదరాబాద్ చుట్టూ పక్కల వాడుతున్న సన్నబియ్యం ఏపీ నుంచి కొనుక్కుంటున్నారు. ఏపీ ధాన్యం సన్నబియ్యం అంటే ఎక్కువ రేట్ ఇచ్చి కొనుగోలు చేస్తున్నారు. బీపీటీ, బాపట్ల మైసూర్ వంటివే తెలంగాణ మిల్లర్లు అదనంగా నగదు ఇచ్చి కొంటున్నారు. ఏపీలో 21 రోజులకే పేమెంట్ రాలేదు. అందుకే మేము కొంటున్నాం అని కేసీఆర్ అన్నారు అది పచ్చి అబద్దం. తెలంగాణ డబ్బున్న రాష్ట్రం ఏపీ ఇంకా గుడిసెనే.. ఐదేళ్లలో మేము రాష్ట్రాన్ని చక్కదిద్దుతున్నాం. ఇప్పుడు విశాఖపట్నం రాజధాని అనుకుంటున్నాం ఇకనుంచి అక్కడ అభివృద్ధి చేస్తాం. తడిసిన ధాన్యం కూడా 1530 రూపాయలు ఎంఎస్పీ ఇప్పించడం వల్ల మిల్లర్లు నుక పెరిగి నష్టపోయారు. దువ్వలో రైతులు తడిసిన ధాన్యం కొనమని రోడ్డెక్కారు. దాన్ని తర్వాత మేమే కొన్నాం. మాకు అక్కడ ఆ రైతులే పాలభిషేకాలు చేశారు" అని కారుమూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు.

# ఎన్నికలల్లో డబ్బులే..డబ్బులు

తరాలు మారినా తలరాత మారడం లేదన్న విషయం ప్రతి ఒక్కరికి తెలిసిందే. ఇది ప్రభుత్వ వైఫల్యమా? లేదా ప్రజల వైఫల్యమా? నీతి, నిజాయితీ, న్యాయం పట్ల నిబద్ధత ఉన్న వారిని ఎన్నుకోకుండా, డబ్బులు ఇచ్చినవారినే ఎన్నుకోవడవే దీనంతటికి కారణంగా చెప్పవచ్చు. దీనిని బట్టి ప్రజలు అభివృద్ధి కోరుతున్నారా? అవినీతి కోరుతున్నారనేది అర్థం కానీ ప్రశ్నగా మారింది. ప్రతినిధుల నేరచరిత్ర ఎన్నికల సంఘం పరిధిలోకి చేర్చడమే కాకుండా, ఓటర్లు సరైన నాయకుడిని ఎన్నుకునే అవకాశం ఉండేలా ఎన్నికల సంఘం వెబ్‌సైట్లలో అన్ని అంశాలను పొందుపరచాలి. అప్పుడే ఓటరు సరైన నాయకుడిని ఎన్నుకునే అవకాశముంది. అంతేకాకుండా అభ్యర్థి గెలిచిన తర్వాత అవినీతికి పాల్పడినట్లైతే ఆ సమయంలో ఓటర్లు రీకాల్ చేసుకొని మరొకరిని ఎన్నుకునే వెసులుబాటు కల్పించాలి. దీనివల్ల అవినీతిని అరికట్టే అవకాశముంది. ప్రస్తుతం కొన్ని దేశాల్లో రీకాల్ సిస్టమ్ అమలులో ఉంది. ఇలాంటి దేశాలలో మాత్రమే సుపరిపాలన పరుగులు పెడుతుంది. ఇలాంటి చట్టాల కోసం యువత కృషి చేయాలి. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలి. ప్రస్తుతం 90 శాతం మంది నాయకులు అవినీతిపరులు అయితే 10 శాతం మంది నిజాయితీ గల నాయకులున్నారు. ఉదాహరణకు గుమ్మడి నర్సయ్య 5 సార్లు ఎమ్మెల్యేగా చేసినా ఇప్పటికి సాధారణ జీవితం కొనసాగించడం గొప్ప విషయం. సమాజానికి గుమ్మడి నర్సయ్య లాంటి వ్యక్తులు అవసరం. ఈరోజుల్లో ఒకసారి ఎమ్మెల్యే అయితేనే తరాలకు సరిపడా సంపాదన వెనకేసుకుంటున్నారు. గుమ్మడి నర్సయ్య లాంటి వాళ్ళు సంపాదన కోసం కాకుండా సమస్యల పరిష్కారం కోసం పోరాడిన నాయకుడు. ఇలాంటి వారిని ప్రజలు ఎందుకు ఎన్నుకోరు? ప్రజలే మోసపోతున్నారు కానీ నాయకులు మోసం చేయడం లేరన్న విషయం గమనించాలి. సమాజంలో మార్పు రావాలంటే సమస్యలపై పోరాడే నాయకుడు కావాలి. అప్పుడే పేదలకు సరైన సంక్షేమ పథకాలు అందుతాయి. ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోని సరైన నాయకుడిని ఎన్నుకోవాలి. పేదోడి కల నెరవేరాలంటే. ఓటు ఆయుధంగా ఉపయోగించిన నాడే సాధ్యవడుతుంది. అభివృద్ధి కోరుకున్నట్లైతే అభివృద్ధి చేసే నాయకున్ని ఎన్నుకోవాలి, అవినీతి కోరుకున్నట్లైతే అవినీతిపరుడైన నాయకున్ని ఎన్నుకోవాలి. ఈ రోజుల్లో అన్ని పార్టీలు డబ్బులు పంచడం మామూలే. అయితే ప్రజలు ఎవరికి ఓటు వేయాలి అనేది ఆలోచించవలసిన ప్రశ్న. డబ్బులు ఎక్కువ ఇచ్చేవాడికా? అభివృద్ధి చేయగలిగే సత్తా ఉన్న నాయకుడికా? చేతులు కాలినాక ఆకులు పట్టుకున్నట్లు ఓటు వేసే సమయంలోనే సరైన నిర్ణయం తీసుకోవాలి. సరైన నాయకున్ని ఎన్నుకోవాలంటే ప్రజల్లో ఓటు హక్కు ప్రాధాన్యత అవగాహన తప్పనిసరి. ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఒకప్పుడు ఎన్నికలు వస్తున్నాయంటే ప్రజలు సంతోషంగా ఓటు వినియోగించడానికి ముందడుగు వేసేవారు. కారణం ఇచ్చిన హామీలు నెరవేరుతాయని, నిరుపేదలకు చేయూత అందుతుందని. అప్పట్లో నాయకులు ఇచ్చే హామీలు అలా నమ్మదగినవిగా ఉండేవి. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు! ఒకాయన ఈసారి మేము గెలిస్తే నిత్యావసర వస్తువుల ధరలు తక్కువే ఇస్తామని, మరొకాయన మేము గెలిస్తే అంతకంటే తక్కువకు ఇస్తామని హామీలిస్తున్నారు. అది సాధ్యమయ్యే పనేనా? అనేది ఓటరు ఆలోచన చేయాల్సిన అవసరముంది. నిత్యావసర వస్తువుల ధరలు మండుతూనే ఉంటాయి. ధరలు పెరగడానికి కారణాలు వెతుకుతూ ప్రజలను మభ్య పెట్టడం తప్ప ప్రయోజనం ఉండదు. అది నాయకుల కనికట్టు మంత్రం. ఊక దంపుడు ఉపన్యాసాలు తప్ప ఉపయోగపడే ఉపన్యాసం ఒకటి ఉండదు. ఇది జగమెరిగిన సత్యం. ఓట్లు దగ్గరపడ్డాక జనాలలో వ్యతిరేకత రాకుండా ఉండటం కోసం నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించి ఓట్లు అయినాక అంతకంత పెంచడం నాయకులకు వెన్నతో పెట్టిన విద్య. అంతేకాకుండా ఓట్లకు ప్రతి గ్రామంలో మద్యం ఏరులై పారుతుంది. తాగనివాడికి కూడా తాగడం నేర్పుతారు తాగుడుకి బానిసను చేసి ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూరుస్తారు. ఓట్లేసే జనాలు ఎర్రివప్పలు అనుకుంటారేమోగాని జనాలు తిరగబడితే అదోలా ఉంటుందన్న సంగతి నాయకులు ఎరుగరు. ఉచిత విద్య, ఉచిత ఆరోగ్యం, ఉచిత రేషన్ లాంటి పథకాలు ప్రజలకు అవసరం అంతేగాని పెన్షన్ పథకాలు పెట్టి సోమరిపోతులను చేస్తున్నారు. ఏ పని చేయక అనారోగ్యానికి గురవుతున్నారు. ప్రస్తుతం నిజాయితీ గల నాయకుడిని ఎన్నుకోవడం ఎలా అనేది ప్రజలకు పెద్ద సవాలే.. నిజాయితీ నాయకుడిని గుర్తించి ఓటు వేయాలి!



## ఫ్రైడే కార్యక్రమం పరిసరాల పరిశుభ్రతకు మార్గదర్శకం: కనిగిరి మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్



కనిగిరి : ప్రజాపాలన ప్రతినిధి : మున్సిపాలిటీ పరిధిలో దోమలు వ్యాప్తి చెందకుండా నిరోధించేందుకు ఇంటింటికి వెళ్లి ఫ్రైడే కార్యక్రమాన్ని నిరంతరం పాటించాల్సిన ప్రాముఖ్యత ఉందని కనిగిరి మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ అన్నారు. శుక్రవారం 20వ వార్డు ఇందిరాకాలనీ సచివాలయం ఆరోగ్య సిబ్బంది చేపట్టిన ఫ్రైడే కార్యక్రమంలో కనిగిరి మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా మురికి నీరు నిల్వ ఉన్న కూలర్స్ లల్లో తొట్లల్లో పాతబడిపోయిన టైర్లలో మురుకు నీరు నిల్వ లేకుండా చూడాలని ప్రజలకు తెలియజేశారు. మురికి నీరు నిల్వ ఉన్న వాటిని మున్సిపల్ కార్మికులచే తొలగించారు. ఇలా చేయడం వల్ల డెంగ్యూ మలేరియా చికెన్ గున్యా ప్రాణాంతకరమైన వ్యాధుల నుండి రక్షించుకునే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏ ఈ కోటేశ్వరరావు, కౌన్సిలర్ దీప మున్సిపల్ కార్మికులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విశాఖ ఉక్కు పరిరక్షణకై జరిగే రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ జయప్రదం చేయండి...



విశాఖ ప్రజాపాలన ప్రతినిధి :ఉక్కు పరిరక్షణకై, కడప స్టీల్ ఫ్యాక్టరీ ప్రారంభించాలని ఈ నెల 8న రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ జయప్రదం చేయాలని కోరుతూ స్థానిక డోన్ పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో వాల్ పోస్టర్లు విడుదల చేసిన విద్యార్థి యువజన ఉపాధ్యాయ సంఘాల నాయకులు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు కే. పవన్ జిల్లా అధ్యక్షులు సూర్య ప్రతాప్ , జిల్లా అధ్యక్షులు రణత్ యాదవ్ , కాంగ్రెస్ పార్టీ డోన్ ఇన్చార్జి మద్దిలేటి స్వామి రాష్ట్ర నాయకులు రమణ, రాష్ట్ర నాయకులు సుబ్బారెడ్డి , వారు మాట్లాడుతూ విశాఖ స్టీల్ ఫ్యాక్టరీ కాపాడాలని కార్మికుల ఉద్యమం 1000 రోజులకు చేరుతున్న సందర్భంగా, కడప స్టీల్ ఫ్యాక్టరీ పునాదులకే పరిమితమైంది దానికి నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని, విభజన హామీలను అమలు చేయాలని విద్య పట్ల, నిరుద్యోగుల పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్నటువంటి విధానాలకు వ్యతిరేకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలని రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థలు బంద్ చేసి నిరసన తెలియజేస్తూ ఈ ఉద్యమంలో విద్యార్థులను, నిరుద్యోగులను కూడా పాల్గొనే విధంగా నవంబర్ 8వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలను బంధు నిర్వహిస్తున్నాము. ఈ బంద్ లో అన్ని రాజకీయ పార్టీలు, విద్యార్థి యువజన సంఘాలు పాల్గొంటున్నారు. కావున ఈ బంద్ విజయవంతంలో ప్రజలు నిరుద్యోగ యువత విద్యార్థులు పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీచర్ ఉపాధ్యాయ సంఘం నాయకులు విద్యార్థి యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు...

## నలుగురు కొడుకులు.. కానీ తండ్రి నడిరోడ్డుపైనే..

ఖమ్మం జిల్లా ప్రజాపాలన ప్రతినిధి : ఎర్రుపాలెం మండలం కంద్రిక



గ్రామానికి చెందిన మాలోతు చంద్రు 74 మూడు రోజుల నుండి మీనవోలు పెట్రోల్ బంకు వద్ద ఉన్న బ్రిడ్జి పైన నడి రోడ్డుపై పడుకొని ఉండగా అసలే ముఖ్య రహదారి కావటం వాహనాల రద్దీ ఎక్కువగా ఉండి కూడా అందరూ చూస్తూ ఉన్నారు కానీ ఎవరు తన పరిస్థితిని తెలుసుకోలేదు పట్టించుకోలేదు. విజయవాడ నుండి మధిర వెళ్లే రహదారి కావడంతో ఒక విలేఖరి మరియు మధిరకు చెందిన స్థానికులు అటుగా వెళుతూ అతని పరిస్థితి గమనించి ఆర్కే ఫౌండేషన్ వారికి తెలియజేయగా వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న డాక్టర్ దోర్నాల రామకృష్ణ ఎర్రుపాలెం ఎస్సై ఎం సురేష్ సూచనలతో సదరు మాలోతు చంద్రు అనే వృద్ధుడిని వైద్య చికిత్సల అనంతరం ఆర్కే ఫౌండేషన్ అనాథ ఆశ్రమానికి తరలించడం జరిగింది. వృద్ధుని వివరాలు సేకరించగా కంద్రిక గ్రామం అని నలుగురు కొడుకులు ఉన్నారని ఇంటి వద్ద కుటుంబ సమస్యలతో ఆరోగ్యం సహకరించక బయటకు వచ్చానని మూడు రోజుల నుండి బ్రిడ్జి పైనే ఉంటున్నానని తెలియజేశాడు.

## అమరవీరుల స్మారక సభలను జయప్రదం చేయండి: సిపిఐ(ఎంఎల్) న్యడెమోక్రసీ



కర్నూలు ప్రజాపాలన ప్రతినిధి : భూమికోసం భుక్తి కోసం ఈ దేశ విముక్తి కోసం జరుగుతున్న పోరులో అసువులు బాసిన అమరవీరులకు నివాళులు అర్పిస్తూ అమరవీరుల స్మారక సభలను జయప్రదం చేయాలని సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి బి.వెంకటస్వామి, జిల్లా నాయకులు. రంగనాయకులు పిలుపు నిచ్చారు. అనంతరం స్థానిక కర్నూలు నగరంలో గోకారి నగర్ నందు గోడపత్రికలను విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమరవీరుల సంస్కరణ సభ బొల్లవరం గ్రామం ఈనెల 6 తేదీన, వేంపెంట గ్రామం నందు కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి 9 తేదీన బహిరంగ సభ ర్యాలీ ఉంటుందని అన్నారు. ఈ బహిరంగ సభకు కేంద్ర రాష్ట్ర నాయకులు హాజరైతారని అన్నారు. అరుణోదయ కళాకారులు ప్రదర్శన ఉంటుందని అన్నారు. నాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నుండి నేడు గోదావరిలో ప్రతిఘటన పోరాటాల దారిలో భూమికోసం భుక్తి కోసం జరుగుతున్న విప్లవోద్యమంలో మృత్యుని ముద్దాడిన వీరకిశోరాలు, కామ్రేడ్.చంద్ర పుల్లారెడ్డి, నీలం రామచంద్రయ్య, అనేకమంది విప్లకారులు మరణించారు. చీకటినీ చీల్చి పండు వెన్నెలను పంచి ఉద్యమానికి ఊపిరూది ఎర్రజెండాను మరింత ఎరుపెక్కించారని అన్నారు. జనం కొరకు తన చివరి శ్వాస వరకు పోరాడిన అనేకమంది విప్లవవీరులు పేద ప్రజల రాజ్యం కై ప్రభుత్వం చేత హత్యగావించబడ్డారని వీరందరికీ సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ విప్లవ జోహార్లు అర్పిస్తూ అమరవీరుల ఆశయ సాధనలో ముందుకు తీసుకువెల్లుతుంది వారి అశయ సాధనలో సభలు జరుపుతామన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై వ్యతిరేక పోరాటానికి సిద్ధం కావడం కోసం అమరవీరుల ఆశయ సాధన కోసం ఉద్యమించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పీ డీ ఎస్ యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్, పీవైఎల్ జిల్లా కార్యదర్శి రమేష్, నగర కార్యదర్శి రాము. గోకారి నగర్ నాయకులు మౌలాబి, రాజమ్మ,సాయి. ఎల్లమ్మ ఇతరులు పాల్గొన్నారు.

## సచివాలయం పరిధిలోని వాలంటరీ వ్యవస్థతోనే సంక్షేమం మరియు అభివృధి సాధ్యం: రాష్ట్ర మంత్రి సోదరులు వై.రాం ప్రసాద్ రెడ్డి.



ప్రజాపాలన ప్రతినిధి : :సచివాలయం పరిధిలోని వాలంటరీ వ్యవస్థతోనే సంక్షేమం మరియు అభివృధి సాధ్యమని రాష్ట్ర మంత్రి ఆర్.కె. రోజా సోదరులు వై. రాం ప్రసాద్ రెడ్డి తెలిపారులి . నగరి మున్సిపాలిటీలోని 25, 26 వార్డుల పరిధిలోని కన్వీనర్లు , గృహసారధులు, వాలంటీర్లతో ప్రత్యేక సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వై.రాం ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని సచివాలయం పరిధిలోని కన్వీనర్లు , గృహ సారధులు, వాలంటీర్లు సమైక్యంగా అభివృద్ధి, సంక్షేమకార్యక్రమాల అమలు కోసం ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. సచివాలయం పరిధిలోని కన్వీనర్లు , గృహ సారధులు, వాలంటీర్లు వారికి కేటాయించిన యాభై ఇళ్లలోని వారి సమస్యలను పరిష్కరించడానికి కృషి చేయాలని తెలిపారు . వైస్సార్సీపీ ప్రభుత్వం సచివాలయం పరిధిలోని ప్రతి ఒక్కరి అభివృద్ధి కోసం కన్వీనర్లు, గృహసారధులు, వాలంటీర్లను నియమించి నట్లు చెప్పారు . వర్షాకాలం లో అంటూ వ్యాధులు రాకుండా దోమలవ్యాప్తిని నివారించడానికి నీటిని నిల్వలేకుండా చూడాలని కోరారు . వర్షాకాలంలో డెంగ్యూ , వైరల్, మలేరియా టైపాయిడ్ వంటి జ్వరాలు రాకుండా ప్రజలను చైతన్యవంతులు చేయాలని చెప్పారు . ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు జ్యోతి, ఇంద్రయ్య, భాస్కర్ , వైస్సార్సీపీ నాయకులు కన్వీనర్లు , గృహసారధులు, వాలంటీర్లు పాల్గొన్నారు .


## జర్నలిస్టులకు జగనన్న దీపావళి కానుక.

మూడు సెంట్లు ఇల్లు స్థలాన్ని క్యాబినెట్లోఆమోదం: ఎమ్మెల్యే మల్లాది విష్ణు




ఎన్టీఆర్ జిల్లా ప్రజాపాలన ప్రతినిధి :విజయవాడ సెంట్రల్ౌ జర్నలిస్టుల సాధక భాదలు గుర్తించి వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టులకు మూడు సేంట్ల స్థలం ముంజూరు చేసేందుకు కేబినెట్ అమొదం లభించిన సందర్భంగా విజయవాడ సెంట్రల్ నియోజవర్గం ఎమ్మెల్యే మల్లాది విష్ణువర్ధన్. నిరంతరం ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పనిచేస్తున్నటువంటి జర్నలిస్టులకు దీపావళి పండుగ కానుకగా ప్రతి జర్నలిస్టుకు మూడు సెంట్లు ఇళ్ల స్థలంకేటాయించినందుకు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి.. సమాచార శాఖ మంత్రివర్యులు, చెల్లిబోయిన వేణుగోపాలకృష్ణ గార్లకి ప్రత్యేక కృతజ్ఞతలుతెలిపారు.. అలాగే మల్లాది విష్ణు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్నటువంటి జర్నలిస్టులకు చిరకాల కోరిక నెరవేర్చి ప్రతి జర్నలిస్టుకి సొంత ఇంటి కల నెరవేసినటువంటి సీఎం జగన్ కి ప్రతి ఒక్క జర్నలిస్టు గుర్తుంచుకోవాలని త్వరలోనే సంబంధిత అధికారుల ద్వారా సమాచార శాఖ మంత్రివర్యులు సమక్షంలో సీఎం జగన్ గార్ల ఆమోది ప్రకారం ప్రభుత్వం గుర్తించిన ప్రతి జర్నలిస్టుకి మూడు సెంట్లు ఇళ్ల స్థలం కేటాయించబడుతుందని దీపావళి కానుకజర్నలిస్టులకు కొత్త ఎలుగులు తోపాటు మంచి రోజులు వచ్చాయని ..సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు..

## చంద్రబాబు మధ్యంతర బెయిల్‌లో అదనపు షరతు అంశంపై హైకోర్టు తీర్పు..



అమరావతి :ప్రజాపాలన ప్రతినిధి :చంద్రబాబు కార్యకలాపాల పరిశీలనకు ఇద్దరు డీఎస్పీలను పెట్టాలన్న సీఐడీ అభ్యర్థన తిరస్కరణ....స్కిల్ కేసు అంశాలపై మీడియాతో మాట్లాడవద్దని గతంలో ఇచ్చిన ఆదేశాలు కొనసాగింపు...రాజకీయ ర్యాలీలో పాల్గొనవద్దని గతంలో ఇచ్చిన ఆదేశాలు కొనసాగుతాయి : హైకోర్టు...

## కర్ణాటక కమలంలో కల్లోలం

బెంగళూరు, నవంబర్ 3, :హైకమాండ్‌పై చాలా గుర్రుగా ఉన్న కర్ణాటక బీజేపీ ఎమ్మెల్యేలు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఆర్నెల్లవుతోంది. ఇప్పటికే ఓడిపోయామన్న బాధలో ఉన్నారు. దీనికి తోడు అధిష్ఠానం తీరు మరింత ఇబ్బంది కలిగిస్తోంది. కొత్త ప్రభుత్వం ఏర్పాటై ఇన్ని నెలలవుతున్నా ఇప్పటి వరకూ ప్రతిపక్ష నేత ని నియమించకపోవడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు బీజేపీ ఎమ్మెల్యేలు. సీనియర్ నేత బీఎస్ యడియూరప్ప ఈ మధ్యే అందరు ఎమ్మెల్యేలతో ఓ మీటింగ్ పెట్టారు. ఆ సమావేశంలోని ఎమ్మెల్యేలంతా అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నేతను నియమించకపోతే...త్వరలోనే జరగనున్న బెలగావిలో వింటర్ అసెంబ్లీ సెషన్‌కి హాజరు కామని బెదిరించారు. బెంగళూరులో జరిగిన సమావేశంలో యడియూరప్పతో గట్టిగానే వాదించినట్టు సమాచారం. పైగా కాంగ్రెస్ నేతలు పదేపదే బీజేపీ నేతల్ని టార్గెట్ చేసుకుని విమర్శలు చేస్తున్నారు. ప్రతిపక్ష నేతనే నియమించుకోలేకపోయారంటూ ఎద్దేవా చేస్తున్నారు. దీనిపైనే బీజేపీ నేతలు అసహనంగా ఉన్నారు. కాంగ్రెస్ చేస్తున్న విమర్శల్ని తిప్పికొట్టలేకపోతున్నామని హైకమాండ్‌తో చెబుతున్నారు. అయితే...ఈ వివాదంపై యడియూరప్ప స్పందించారు. ప్రతిపక్ష నేతను నియమించడంపై బీజేపీ పూర్తిస్థాయిలో దృష్టి పెట్టిందని, అన్ని విధాలుగా ఆలోచించి నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. బెలగావిలో జరగనున్న సమావేశంలో ఇది ఖరారు చేస్తామని చెప్పారు. అంతా హైకమాండ్ చేతుల్లోనే ఉందని వెల్లడించారు. అటు కాంగ్రెస్ మాత్రం బీజేపీపై విమర్శల్ని ఆపడం లేదు. ఆ పార్టీలో అంతర్గత కలహాలు పెరిగిపోతున్నాయని, రాష్ట్ర చరిత్రలోనే ప్రతిపక్ష నేతని నియమించడంలో ఎప్పుడూ ఆలస్యం కాలేదని మండి పడుతోంది. ఆర్నెల్లు దాటినా ఇంకా నిర్ణయం తీసుకోలేకపోతోందని విమర్శిస్తోంది. ఆ పార్టీ పరిస్థితేంటో ఇది చూస్తేనే అర్థమవుతోందని సెటైర్లు వేస్తోంది. ఈ ఏడాది మే 10వ తేదీన కర్ణాటక ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ 135 సీట్ల మెజార్టీతో విజయం సాధించింది. బీజేపీకి 66,జేడీఎస్‌కి 19 సీట్లు వచ్చాయి. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యపై ఇటీవలే బీజేపీ అభ్యంతరకర ట్వీట్ చేసింది. దీనిపై కాంగ్రెస్ తీవ్రంగా మండిపడుతోంది. ఆ పార్టీపై పోలీసులకు ఫిర్యాదు కూడా చేసింది. సిద్దరామయ్యను కించపరిచేలా కొన్ని పోస్టర్‌లు చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది బీజేపీ. సిద్దరామయ్య చీఫ్ మినిస్టర్‌కి బదులుగా సిద్దరామయ్య కలెక్షన్ మాస్టర్ అని పోస్ట్‌లు పెట్టింది. డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌పైనా ఇలాంటి ట్వీట్‌లే చేసింది. దీంతో కర్ణాటక కాంగ్రెస్ భగ్గుమంది. కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఢిల్లీలో కాంగ్రెస్ నేతల ఇళ్లపై ఐటీ దాడులు జరిగాయి. ఈ సోదాల్లో మొత్తం రూ.94 కోట్ల నగదుని స్వాధీనం చేసుకుంది. మరో రూ.8 కోట్ల విలువైన వస్తువుల్నీ సీజ్ చేసింది. ఈ క్రమంలోనే బీజేపీ సిద్దరామయ్యపై ఈ ట్వీట్‌లు చేసింది. ఇదంతా బీజేపీ కుట్రపూరితంగా చేస్తోందని కాంగ్రెస్ అసహనం వ్యక్తం చేసింది. ఎవరి ఇంట్లోనే దాడులు జరిగితే వాళ్ల పేర్లు తొలగించి సిద్దరామయ్య పేరుతో మార్ఫింగ్ చేసి మరీ ప్రచారం చేస్తున్నారని మండి పడింది. ట్విటర్‌లో వరుస పోస్ట్‌లు పెట్టి కాంగ్రెస్ నేతల్ని అవమానిస్తున్నారని పలువురు సీనియర్ నేతలు ఫైర్ అయ్యారు.

## క్లోరిన్ గ్యాస్ లీకేజీ వీడియో..

(మొదటి పేజీ తరువాయి)

నిన్నటి నుంచి సిలిండర్ సమస్య ఉన్నా ఎలాంటి చర్యలు తీసుకోలేదని విద్యార్థులు వాపోతున్నారు. ఈరోజు అకస్మాత్తుగా దట్టమైన గ్యాస్ వెదజల్లడంతో అందరూ అస్వస్థతకు గురయ్యారు. ఈ పరిస్థితి గురించి అందరికీ తెలుసు కానీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని నర్సింగ్ విద్యార్థి తెలిపారు. ఈ అమానుష ఘటనపై మధుర సీఎంవో స్పందించింది. ఇందులో సిబ్బంది తరఫున ఎలాంటి నిర్లక్ష్యం లేదని మధుర సీఎంఓ డాక్టర్ అజయ్ కుమార్ వర్మ తెలిపారు. నిన్న, మేము క్యాంపస్‌లో వింత వాసనను పసిగట్టామన్నారు. ఇందులో భాగంగా అగ్నిమాపక శాఖను పిలిపించామని తెలిపారు. తక్షణం స్పందించిన ఫైర్ సిబ్బంది చుట్టుపక్కల పరిసరాలన్నింటినీ పరిశీలించి పరిస్థితిని నియంత్రించారు. అయితే ఈ రోజు, ఉదయం 11 గంటల నుండి మళ్లీ వాసన వచ్చింది. అగ్నిమాపక శాఖ సమస్యను గుర్తించిందని డాక్టర్ వర్మ తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలలో పలువురు నర్సింగ్ విద్యార్థులు దగ్గుతున్నట్లు కనిపించింది. మరి కొందరు వాంతులు చేసుకున్నారని డాక్టర్ వర్మ చెబుతున్నారు. ఈ వాసనకు నేలపై కుప్పకూలిపోగా, మరికొందరు ఊపిరి పీల్చుకోవడానికి ఇబ్బంది పడ్డారు. ఈ ఘటనపై కొంతమంది విద్యార్థులు ఆందోళన చెందారు. వారిని బయటకు తీసుకువచ్చి ధైర్యం చెప్పే ప్రయాత్నం చేశారు. ప్రస్తుతం వారందరి ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు. ఇది పాత సమస్యే అని చెప్పారు అక్కడి సిబ్బంది. పంపింగ్ స్టేషన్‌తో పాటూ సిలిండర్లు కూడా ఖాళీగా ఉన్నాయి. దీంతో అందులో క్లోరిన్ నిండి ఉంటుందని వివరించారు.

## ఈ నెల 20 నుండి కులగణన

(మొదటి పేజీ తరువాయి)

కుల సంఘాలను కూడా ఈ సమావేశాలకు ఆహ్వానించి వారి అభిప్రాయాలు కూడా స్వీకరించనుంది. సామాజిక సాధికార సురక్ష కార్యక్రమంగా సమగ్ర కులగణనను చేపట్టేలా ప్రభుత్వం ముందుకెళ్లనుంది.ఇదిలావుంటే, రానున్న ఎన్నికల కోసం రాజకీయ వ్యూహం రెడీ అవుతోంది. ఎవరి లెక్కలు వాళ్లవే.. మొత్తానికి కీలక సమయంలో ఏపీ కేబినెట్ భేటీ కీలకంగా మారింది. ఏపీలో కులగణనకు ఏపీ సర్కార్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. అందరి బంధువుగా అన్ని వర్గాల సమగ్రాభివృద్ధి కోసమే ఏపీ కేబినెట్ కుల గణన నిర్ణయాన్ని ఆమోదించిందన్నారు మంత్రి వేణు గోపాల కృష్ణ. జిల్లాల వారీగా అన్ని కులసంఘాలు అభిప్రాయాలను, సూచనలను పరిగణలోకి తీసుకుంటామన్నారు.ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అధ్యక్షతన రాష్ట్ర కేబినెట్ సమావేశమైంది. రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు పలు కంపెనీలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో పాటు సంక్షేమ పథకాల అమలు, ఉద్యోగాల భర్తీ, రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులపైనా కేబినెట్ చర్చించింది.ఆంధ్రప్రదేశ్ మంత్రి మండలి సమావేశం సీఎం వైఎస్ జగన్ అధ్యక్షతన అమరావతి సచివాలయంలో జరిగింది..ఈ సమావేశంలో కీలక నిర్ణయాలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. మొత్తం 38 అంశాలపై కేబినెట్ సమావేశంలో చర్చ జరిగింది. ఇటీవల రాష్ట్ర పరిశ్రమల ప్రోత్సాహక మండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. మొత్తం రూ.19వేల 37 కోట్ల పెట్టుబడులకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. వివిధ రంగాల్లో కొత్తగా ఏర్పాటు చేస్తున్న కంపెనీలతో పాటు ఇప్పటికే నడుస్తున్న పరిశ్రమల విస్తరణకు ఆమోదం తెలిపింది కేబినెట్.

# 2500 బస్సుల కొనుగోలుకు ప్రణాళికలు





నూజివీడు, నవంబర్ 03, ప్రజాపాలన ప్రతినిధి: రాష్ట్రవ్యాప్తంగా 2500 కొత్తగా బస్సులు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్, వైస్ చైర్మన్ సిహెచ్ ద్వారక తిరుమలరావు శుక్రవారం తెలిపారు. సాధారణ తనిఖీలలో భాగంగా నూజివీడు వచ్చిన సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 1500 డీజిల్ బస్సులు కొనుగోలు చేయడంతోపాటు, 200 డీజిల్ బస్సులను ఎలక్ట్రిక్ బస్సులుగా మారుస్తున్నామన్నారు. పర్యావరణహితమైన 800 ఎలక్ట్రిక్ బస్సులు, మొత్తం 2500 బస్సులు విడతల వారీగా రాష్ట్రంలోని అన్ని డిపోలకు పంపడం జరుగుతుందన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఏపీఎస్ఆర్టీసీ అనేక ప్రణాళికలతో ముందడుగు వేయనున్నట్లు తెలిపారు. ప్రత్యేక ఉత్సవాలకు సంబంధించి అదనపు బస్సు సర్వీసులు, పుణ్యక్షేత్రాలు, తీర్థరామాలు పర్యటించేందుకు భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక సర్వీసులు అందుబాటులోకి తెస్తున్నట్లు చెప్పారు. ప్రయాణికుల సూచనల మేరకు దూరప్రాంతాలకు వెళ్లే సర్వీసులుగా అత్యాధునిక బస్సులను అందించే ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు.

**పాత్రికేయులపై ఆర్టీసీ ట్రాఫిక్ ఇన్చార్జి వీరంగం:**

ఏపీఎస్ఆర్టీసీ ఎండీ, వైస్ చైర్మన్ సిహెచ్ ద్వారకాతిరుమలరావు పర్యటన సందర్భంగా వార్తను కవర్ చేసేందుకు వచ్చిన పాత్రికేయులపై నూజివీడు ఆర్టీసీ డిపోకు చెందిన ట్రాఫిక్ ఇంచార్జ్ రజిని కొద్దిసేపు వీరంగం వేశారు. ఆర్టీసీకి చెందిన కొందరు కార్మికులు ట్రాఫిక్ ఇంచార్జి రజిని నిత్యం వేధింపులకు గురి చేస్తున్నారని, రజనీపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేయడం జరిగింది. కార్మికుల ఆరోపణల నేపథ్యంలో చర్యలు ఏమి చేపట్టనున్నారని ఆర్టీసీ ఎండి ద్వారకాతిరుమలరావును పాత్రికేయులు ప్రశ్నించగా, క్షేత్రస్థాయిలో పరిశీలన అనంతరం చర్యలు చేపట్టడం జరుగుతుందని స్పష్టం చేశారు. అక్కడే ఉండి అన్నీ గమనిస్తున్న రజిని ఆగ్రహం వ్యక్తం చేస్తూ తన గురించి అడగవలసిన అవసరం ఏముందంటూ హుంకరించారు.

విధి నిర్వహణలో భాగంగానే ఆర్టీసీ ఎండీని ప్రశ్నించామని, ఎవరిపై తమకు వ్యక్తిగత ద్వేషాలు ఉండవని పాత్రికేయులు సమాధానం చెప్పినప్పటికీ, పెడచెవిన పెట్టిన రజని రెట్టించిన ఆగ్రహం వ్యక్తం చేస్తూ తాను అధికార వైఎస్ఆర్ సీపీలో రాష్ట్ర నాయకురాలిగా పని చేస్తున్నానని, తనను ఎవరు ఏమీ చేయలేరంటూ ప్రగ్బాలు పలికారు. మొత్తంగా ఈ వ్యవహారంపై పాత్రికేయులు ఆర్టీసీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలుస్తోంది.

# బయటకు రావాలంటేనే... భయమేస్తుంది

**సమాధులతో తప్పని సహవాసం**

**క్షణం క్షణం.., భయం భయం.., బిక్కుబిక్కుమంటున్న ప్రజలు**

**ప్రహరీ లేని స్మశాన వాటికతో ఇక్కట్లు**

**పేరుకుపోయిన చెత్తాచెదారాలు, అధ్వానంగా స్మశాన వాటిక**

**స్మశాన వాటికను శుభ్రపరిచి, చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలని స్థానికుల వినతి**



చీరాల, నవంబర్ 03, ప్రజాపాలన : క్షణం క్షణం.., భయపడుతూ, సమాధులతో తప్పనిసరి పరిస్థితులలో,సహవాసం చేస్తూ, బయటికి రావాలంటేనే భయపడుతూ, బిక్కు బిక్కు మంటూ, ఆ ప్రాంత ప్రజలు కాలం వెళ్లదీస్తున్నారు. వివరాలను పరిశీలిస్తే..., చీరాల మండలం రామకృష్ణా పురం పంచాయతీ పరిధిలోని, బండపాలెం గృహాల కానుకొని ఉన్న స్మశానవాటిక కి ప్రహరీ కరువైంది. దీంతో ఇళ్లు, స్మశాన వాటిక సమాధులు అనుకున్నట్లుగా ఉంటాయి. గతంలో చిన్నపాటి పిట్ట గోడ ఉన్నా, అది సగం పైగా ధ్వంసమై, నిరుపయోగంగా మారినా, పట్టించుకున్న నాధుడే కరువయ్యారు. దీనికి తోడు స్మశాన వాటిక అంతా చిల్ల చెట్లు ఏపుగా పెరిగి, చెత్తా చెదారాలు పేరుకు పోయి, దుర్గంధ భరితంగా మారింది. బండపాలెం ప్రాంతవాసులు, బయటికి రావాలంటేనే భయపడుతున్నారు. ప్రత్యేకించి మహిళలు, చిన్నారులు, సమాధులు ఉండడం వల్ల బిక్కుబిక్కుమంటూ, కాలం గడుపుతున్నారు. కొందరు చిన్నారులైతే స్మశాన వాటికలో అంత్యక్రియలను చూసి, భయపడి అనారోగ్యం పాలైన సందర్భాలు కూడా ఉన్నాయి.కనీసం ప్రహరీ గోడ కూడా నిర్మించలేకపోవడంతో, స్మశాన వాటికలో సమాధులు, బండపాలెం ప్రాంతంలోని ఇళ్లు కలిసిపోయినట్లుగా ఉంటాయి. కనీసం స్మశాన వాటిక ప్రాంతాన్ని, దుర్గంధ భరితం లేకుండా శుభ్రపరిచి, స్మశానవాటిక చుట్టూ ప్రహరీ గోడ నిర్మించి, తమ బాధలను తీర్చాలని ఆ ప్రాంత వాసులు వేడుకుంటున్నారు.

-- స్మశాన వాటిక చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలి.

- కత్తుల వెంకట దుర్గారావు,సంచారజాతుల బాపట్ల జిల్లా అధ్యక్షులు, బండపాలెం ప్రాంత వాసి

- స్మశానవాటిక చుట్టూ ప్రహరీ లేకపోవడంవలన, ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు. మహిళలు, చిన్నారులు భయపడుతున్నారు. స్మశాన వాటిక అధ్వానంగా తయారయ్యింది. స్మశాన వాటికను శుభ్రపరిచి, చుట్టు ప్రహరీ గోడ నిర్మిస్తే బాగుంటుంది.

## అందరి భాగోతాలు బయటపెడుతా: మైనంపల్లి

హైదరాబాద్ :మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు మల్కాజ్గిరి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మీడియా సమావేశం నిర్వహించారు. నా కంఠంలో ప్రాణం ఉన్నంతవరకు క్యాడర్ కోసం పనిచేస్తా. ఆస్థలు అమ్మయినా సరే ప్రజాసేవలో ఉంటా. నా పైన వ్యక్తిగత విమర్శలకు దిగుతున్న మంత్రి ఖబర్దార్ అని హెచ్చరించారు. రాష్ట్రంలో ఇసుక మాఫియా, ప్రభుత్వ సీలింగ్ భూములను ఎన్నికలకు నెల రెండు నెలల ముందు ఎన్ఓసి తీసుకొని లక్షల కోట్ల రూపాయలు సంపాదిస్తున్నావు. వచ్చే కాంగ్రెస్ ప్రభుత్వంలో కచ్చితంగా బయటికి జైలుకు పంపుతాము. చిన్ననాటి నుంచి నీ స్థాయి ఏందో తెలుసు. హరీష్ రావు ముఖ్యమంత్రి కుటుంబ సభ్యుడివై ఉండి లక్షల కోట్ల రూపాయల అవినీతి పాల్పడుతున్నాం.. అవినీతికి పాల్పడే మంత్రి మల్లారెడ్డికి వారి అల్లుడికి టిక్కెట్ ఇచ్చి నాపై బురదల్లే ప్రయత్నం చేస్తే సహించేది లేదు. ఢిల్లీ హోటల్ రూమ్లలో భాగవతాలు బయట పెడితే మీరు ఒక్కరు కూడా రోడ్ల తిరగదు. మల్లారెడ్డి నీది నీ అల్లుడుది క్లబ్బులు,పబ్బుల పొంటి . చరిత్ర అవసరమున్నప్పుడు బయట పెడతా ఖబర్దార్. తిరుపతి వెంకన్ననే ఈ ప్రభుత్వ మునుగుతుందని నన్ను కాంగ్రెస్ వైపు నడిపిస్తున్నాడు. ప్రజలలో దేవుని కూడా హేళన చేస్తున్నవు నీకు సరైన గుణపాఠం ప్రజలనుంచి లభిస్తుంది మల్లారెడ్డి. 30 సంవత్సరాల నుంచి ప్రజాసేవలోనే ఉన్నాను కంఠంలో ఊపిరి ఉన్నంతవరకు ప్రజలతోనే ఉంటా. ప్రజా ఆదరణ నాకు ఉంది కచ్చితంగా గెలుస్తాను ప్రభుత్వం ఏర్పడుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినంక అవినీతి మంత్రుల పని పట్టడం ఖాయం. బఫున్ల వ్యవహరిస్తున్న మంత్రి మరోసారి నోరు జారకు వ్యక్తిగతంగా నన్ను తగ్గించే ప్రయత్నం చేయొద్దు. ప్రజలారా ప్రతిదీ గమనించండి వారిచ్చిన డబ్బులు తీసుకోండి కాంగ్రెస్ గుర్తుకు ఓటేయండని అన్నారు. ...

## దుమారం రేపుతున్న మహువా వ్యవహారం

న్యూఢిల్లీ, నవంబర్ 3, :లోక్‌సభలో డబ్బులు తీసుకుని ప్రశ్నలు అడిగారన్న వివాదంలో ఎథిక్స్ కమిటీ విచారణ నుంచి తృణమూల్ ఎంపీ మహువా మొయిత్రా వాకౌట్ చేశారు. రోతపుట్టించే ప్రశ్నలు అడిగారంటూ ఆమె నిప్పులు చెరిగారు. ఆమెతోపాటు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, డానిష్ అలీ వంటి విపక్ష ఎంపీలంతా ఈ విచారణను బహిష్కరించారు. ఒక మహిళా ఎంపీని పట్టుకుని వ్యక్తిగత విషయాలను కమిటీ చైర్మన్ అడుగుతున్నారంటూ ఉత్తమ్‌కుమార్ రెడ్డి విమర్శించారు. ప్రతి రోజు రాత్రి మీరు ఎవరు ఫోన్లో మాట్లాడుతున్నారు ? మీరు ఎక్కడికి వెళుతున్నారు, ఎవరితో ప్రయాణం చేస్తున్నారు, ఏ హోటల్‌లో ఉంటున్నారంటూ అసంబద్ధ ప్రశ్నలు అడుగుతున్నారని వీరిద్దరూ మండిపడ్డారు.నైతిక విలువల కమిటీ చైర్మన్ అనైతికంగా ప్రవర్తిస్తున్నారని ఉత్తమ్ విరుచుకుపడ్డారు. ఇతరుల ప్రోద్బలంతో ఎథిక్స్ కమిటీ పనిచేస్తున్నట్లు కనిపిస్తోందని విపక్ష ఎంపీలు విమర్శించారు. కమిటీ తీరుకు నిరసనగా సమావేశం నుంచి విపక్ష ఎంపీలు కూడా వాకౌట్ చేశారు.మహువా మొయిత్రా తమ కమిటీకి, దర్యాప్తునకు సహకరించలేదని ఎథిక్స్ కమిటీ చైర్మన్ వినోద్ సోన్‌కర్ విమర్శించారు. విపక్ష సభ్యులు కూడా ఆగ్రహంతో ఆరోపణలు చేశారనీ, ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక అకస్మాత్తుగా వాకౌట్ చేశారని తప్పుబట్టారాయన. తనతోపాటు, ఎథిక్స్ కమిటీపై అభ్యంతరకరంగా మాట్లాడి, తమ విధులకు ఆటంకం కలిగించారని వినోద్ సోన్‌కర్ మండిపడ్డారు.న్యాయవాది జై అనంత్ దేహద్రాయ్.. గతంలో మహువాకు సన్నిహితుడు. కొన్నాళ్లు వారిద్దరు సహజీవనం చేశారు. వారు విడిపోయిన తర్వాత పెంపుడు కుక్క, మరికొన్ని వస్తువుల విషయంలో వారిద్దరి మధ్య విభేదాలు ఏర్పడినట్లు తెలుస్తోంది. తన మీద కక్షతో దేహద్రాయ్ ఇదంతా చేస్తున్నాడని మొయిత్రా అంటున్నారు. మరోపక్క అదానీని లక్ష్యంగా చేసుకోవడానికి వ్యాపారవేత్త దర్శన్ హీరానందాని నుంచి మహువాకు సొమ్ము అందినట్లు బీజేపీ ఆరోపిస్తోంది. ప్రశ్నలు అడగడానికి డబ్బు తీసుకున్నట్లు వచ్చిన ఆరోపణలను మహువా తీవ్రంగా ఖండించారు. అయితే పార్లమెంట్ లాగిన్ ఐడీని వ్యాపారవేత్త హీరానందానికి ఇచ్చినట్లు మాత్రం అంగీకరించారు.

## బాబును వెంటాడుతున్న కేసులు

విజయవాడ, నవంబర్ 3, :ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో చంద్రబాబుపై వరస కేసులు నమోదవుతున్నాయి. ఇప్పటికే స్కిల్ డెవలెప్‌మెంట్ స్కామ్ కేసులో అరెస్టయి యాభై రెండు రోజుల పాటు రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉండి మధ్యంతర బెయిల్ పై బయటకు వచ్చిన సంగతి తెలిసిందే. అనారోగ్య కారణాలతో ఆయనకు నాలుగు వారాల పాటు బెయిల్ లభించింది. దీంతో ఆయన ప్రస్తుతం హైదరాబాద్ లోని ఏఐజీ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎల్.వి. ప్రసాద్ కంటి ఆసుపత్రిలో ఆయనకు చికిత్స చేసేందుకు ఏర్పాట్లు చేశారు. అయితే చంద్రబాబుపై ఇప్పటికే స్కిల్ డెవలెప్‌మెంట్ కేసు ఉండగానే ఫైబర్ నెట్ కేసు నమోదయింది. ఇన్నర్ రింగ్ రోడ్డు స్కామ్ కేసులో కూడా చంద్రబాబును నిందితుడిగా చేరుస్తూ సీఐడీ కేసు నమోదు చేసింది. ఆ తర్వాత మద్యం కేసులో చంద్రబాబు ఏ 3 నిందితుడిగా పేర్కొంటూ సీఐడీ కేసు నమోదు చేసింది. ఈ కేసులో మాజీ మంత్రి కొల్లు రవీంద్రను కూడా నిందితుడిగా చేర్చింది. తాజాగా మరో కేసును కూడా సీఐడీ చంద్రబాబుపై నమోదు చేయడం విశేషం.చంద్రబాబు సన్నిహితుల ఆస్తుల అటాచ్‌మెంట్‌కు పదివేల కోట్ల నష్టం... చంద్రబాబు పాలనలో ఇసుక అక్రమాలపై సీఐడీ విచారణ చేపట్టింది. దీనిపై కేసు నమోదు చేసింది. ఏపీఎండీసీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసింది ఈ కేసులో ఏ1 నిందితురాలుగా మాజీ మంత్రి పీతల సుజాత, ఏ2 నిందితుడుగా చంద్రబాబు, ఏ3 నిందితుడుగా చింతమనేని ప్రభాకర్, ఎ4 నిందితుడుగా దేవినేని ఉమామహేశ్వరరావుపై కేసు నమోదు చేసింది. చంద్రబాబు ప్రభుత్వ నిర్ణయాలతో పదివేల కోట్ల మేరకు ఇసుక దోపిడీ జరిగిందని సీఐడీ విచారణలో వెల్లడయిందని తెలిపింది. వీటన్నింటిలో చంద్రబాబు బెయిల్ తెచ్చుకోవాల్సి ఉంటుంది.చంద్రబాబు నాయుడిపై మరో కేసు నమోదైంది. తెలుగుదేశం పార్టీ హయాంలో ఇసుక అక్రమాలపై కేసులో ఏపీ మైనింగ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐడీ అధికారులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో పీతల సుజాతా ఏ1, చంద్రబాబు నాయుడు ఏ2, చింతమనేని ప్రభాకర్ ఏ3, దేవినేని ఉమాలు ఏ4గా ఉన్నారు. వీరు అక్రమ మైనింగ్‌ల కారణంగా ప్రభుత్వ ఖజానాకు భారీ ఎత్తున గండిపడిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. విచ్చల విడిగా ఇసుక తవ్వకాలు జరిపారని తెలిపారు. గతంలో చంద్రబాబు చేసిన పర్యావరణ నష్టానికి సంబంధించి నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్ రూ. 100 కోట్లు జరిమానా విధించింది.ఉచితంగా పేదలకు ఇసుక అందిస్తామన్న ముసుగులో ఈ కుంభకోణానికి పాల్పడినట్లు పేర్కొన్నారు. కాంట్రాక్టులను ప్రైవేట్ వ్యక్తులకు కేటాయించి అదినంత దోచుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఉచితంగా ఎంత మంది పేదలకు ఇసుకను అందించారో రికార్డ్ బయటకు తీయాలని తెలిపారు. రాష్ట్రంలో 1000కు పైగా అక్రమ ఇసుక మైనింగ్ కేసులు నమోదయ్యాయి. వసూలు చేసిన పెనాల్టీ విలువ రూ. 40 కోట్లు ఇది సంబంధించి వివరాలను, వాటి లెక్కలను చూపించాలని ఇందులో చేర్చారు. "ఉచిత ఇసుక విధానం" ద్వారా ఖనిజ వనరుల దోపిడీదారులు ప్రభుత్వానికి చెల్లించాల్సిన చట్టబద్ధమైన బకాయిలు కోట్లాది రూపాయలు చెల్లించలేదన్నారు.

జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన

## సంపాదకీయం

**శనివారం 04, నవంబరు 2023**

### గాజాపై ఇజ్రాయిల్ యుద్ధం - మతోన్మాదుల వైఖరి

తమ హక్కుల కోసం పోరాడుతున్న పాలస్తీనియన్లను తీవ్రవాదులుగా చిత్రిస్తూ ఇజ్రాయిల్ ప్రభుత్వం, యూదు తీవ్రవాదులు సాగించే ప్రచారాన్నే మక్కికి మక్కీగా ఆర్ఎస్ఎస్–బిజెపి అనుసరిస్తున్నాయి. హిందూత్వ వ్యవస్థాపకుడు వి.డి.సావర్కర్ కాలం నుండి హిందూ మితవాద జాతీయవాదులు యూదువాదానికి...అరబ్బులను, పాలస్తీనియన్లను తరిమికొట్టడం ద్వారా ఇజ్రాయిల్ దేశ ఏర్పాటుకు మద్దతునిస్తూనే వున్నారు. ఈ హిందూత్వ ప్రపంచ దృక్పథమే ఈనాడు మోడీ ప్రభుత్వ వైఖరిని నిర్దేశిస్తోంది. ఇజ్రాయిల్‌ను పూర్తిగా సమర్ధిస్తూ, గాజాపై కాల్పుల విరమణకు ఇచ్చే పిలుపులను తిరస్కరిస్తూ జో బైడెన్, రిషి సునాక్, ఒలాఫ్ షుల్జులతో నరేంద్ర మోడీ కూడా జతగట్టారు. కేరళలోని కలామస్సేరిలో క్రిస్టియన్ గ్రూపు సమావేశంపై జరిగిన బాంబు పేలుళ్ళను మతతత్వ పెట్టుబడిగా చేసుకోవాలన్న ఆత్రంతో కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ చేసిన యత్నాలు జుగుప్స కలిగిస్తున్నాయి. గాజాపై ఇజ్రాయిల్ యుద్ధానికి సంబంధించి బిజెపి–ఆర్ఎస్ఎస్ వర్గాల ప్రచారం తాలూకు విషపూరిత స్వభావాన్ని ఇది బయటపెట్టింది. బాంబు పేలుళ్లు సంభవించిన వెంటనే, చంద్రశేఖర్ మాట్లాడుతూ, క్రిస్టియన్ సమావేశాన్ని జిహాదీ శక్తులు లక్ష్యంగా చేసుకున్నాయని అవాకులు చవాకులు పేలారు. ఆ సమావేశంలో ప్రసంగించేందుకు హమాస్ నేతను కేరళ ప్రభుత్వం అనుమతించిందని, పర్యవసానంగా 24 గంటల్లో బాంబు పేలుడు సంభవించిందని నిందించారు. సిపిఎం, కాంగ్రెస్‌లు బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. హమాస్ మాజీ చీఫ్ ఇస్మాయిల్ హనియె చేసిన ప్రసంగ పాఠం ఇంటర్‌నెట్‌లో అందుబాటులో వుంది, దాన్ని ఎవరైనా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు, అంతే తప్ప హమాస్ నేత ప్రసంగాన్ని అనుమతించే ప్రశ్నే లేదు. పైగా, చంద్రశేఖర్, ఆయన పార్టీ చెబుతున్నట్లుగా హమాస్ ఐక్యరాజ్య సమితి ప్రకటించిన తీవ్రవాద సంస్థ కాదు. బాంబు పేలుడు జరిగిన కొద్ది గంటల వ్యవధిలోనే, ఒక వ్యక్తి పోలీసులకు లొంగిపోయాడు. ఈ దాడికి తనదే బాధ్యత అని ప్రకటించాడు. ఆ వ్యక్తి క్రైస్తవ గ్రూపులోని అసమ్మతి సభ్యుడు. ఇది మంత్రి చంద్రశేఖర్‌కు ఇబ్బందికరంగా పరిణమించింది కాబోలు. ఆయన చేసిన వ్యాఖ్యల్లోని విషాన్ని నిర్లక్ష్యం చేయరాదు. ఎందుకంటే, బిజెపి, హిందూత్వ శక్తులకు సంబంధించిన సోషల్ మీడియా గ్రూపులు అదే పనిగా సాగిస్తున్న పాలస్తీనా వ్యతిరేక మతోన్మాద ప్రచారం తరహాలో ఈ వ్యాఖ్యలు వున్నాయి. పాలస్తీనియన్లందరూ జిహాదీలని, హమాస్ తీవ్రవాద సంస్థ అని ముద్ర వేశారు. ఇజ్రాయిల్ ఇప్పుడు ఎలాగైతే తీవ్రవాద హింసను ఎదుర్కొంటోందో అలాగే భారత్‌లో ముస్లింల నుండి కూడా హిందువులు ఇటువంటి ముప్పే ఎదుర్కొంటారని వారు హెచ్చరిస్తున్నారు. ఇస్లామా ఫోబియాను పెంపొందించేందుకు పాలస్తీనియన్లు, హమాస్ అత్యాచారాలకు పాల్పడ్డారంటూ కట్టుకథలు అల్లి, వాటిని విస్తృతంగా ప్రచారంలో పెడుతున్నారు. ఇస్లామిక్ తీవ్రవాదంపై పోరాటంలో ఇజ్రాయిల్‌ను ఒక నమూనాగా చూపుతున్నారు. ఈ మతోన్మాద ప్రాపంచిక దృక్పథం స్వతంత్ర దేశం కోసం పాలస్తీనియన్లు జరుపుతున్న పోరాటాన్ని ముస్లిం సమస్యగా చూస్తోంది. పాలస్తీనియన్లను వారి మాతృభూమి నుండి వెళ్ళగొట్టి జాతి ప్రక్షాళన గావించాలని చూస్తున్న యూదు దురహంకార ప్రాజెక్టుకు సహజంగానే మద్దతునిస్తోంది. తమ హక్కుల కోసం పోరాడుతున్న పాలస్తీనియన్లను తీవ్రవాదులుగా చిత్రిస్తూ ఇజ్రాయిల్ ప్రభుత్వం, యూదు తీవ్రవాదులు సాగించే ప్రచారాన్నే మక్కికి మక్కీగా ఆర్ఎస్ఎస్–బిజెపి అనుసరిస్తున్నాయి. హిందూత్వ వ్యవస్థాపకుడు వి.డి.సావర్కర్ కాలం నుండి హిందూ మితవాద జాతీయవాదులు యూదువాదానికి... అరబ్బులను, పాలస్తీనియన్లను తరిమికొట్టడం ద్వారా ఇజ్రాయిల్ దేశ ఏర్పాటుకు మద్దతునిస్తూనే వున్నారు. ఈ హిందూత్వ ప్రపంచ దృక్పథమే ఈనాడు మోడీ ప్రభుత్వ వైఖరిని నిర్దేశిస్తోంది. ఇజ్రాయిల్‌ను పూర్తిగా సమర్ధిస్తూ, గాజాపై కాల్పుల విరమణకు ఇచ్చే పిలుపులను తిరస్కరిస్తూ జో బైడెన్, రిషి సునాక్, ఒలాఫ్ షుల్జులతో నరేంద్ర మోడీ కూడా జతగట్టారు. మానవతా సంధి కోసం పిలుపిస్తూ ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ చేసిన తీర్మానంపై జరిగిన ఓటింగ్‌లో గైర్హాజరవడం ద్వారా భారత్, ప్రపంచ పేద దేశాల వైఖరికి దూరం పాటించింది. ఇజ్రాయిల్‌కు గుడ్డిగా మద్దతిస్తున్న పశ్చిమ దేశాల సరసన చేరింది. ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ తీర్మానానికి 120 దేశాలు మద్దతిచ్చాయి. గాజాపై ఆటవిక దాడి, దండయాత్ర జరుగుతుంటే, ఇజ్రాయిల్ సాయుధ బలగాలు పాల్పడుతున్న యుద్ధ నేరాలపై భారత ప్రభుత్వం మౌనం వహిస్తోంది. వంద మందికి పైగా పౌరులు మరణించినటువంటి ఉత్తర గాజాలోని జబాలియా శరణార్థ శిబిరంపై బాంబు దాడి తర్వాత కొన్ని యూరోపియన్ దేశాల విదేశాంగ మంత్రులు యుద్ధంలో అంతర్జాతీయ నిబంధనలకు కట్టుబడి ఉండాలని ఇజ్రాయిల్‌ను కోరారు. కానీ భారత విదేశాంగ శాఖ మాత్రం ఈ విషయంలో మౌనం వహించింది. ప్రత్యేక స్వతంత్ర దేశం కావాలని కోరుతున్న పాలస్తీనియన్ల ఆశయం పట్ల నిబద్ధత ఉందంటూనే, మరో పక్క ఇజ్రాయిల్‌కు మద్దతును ఇస్తూ రెండింటినీ సమతుల్యం చేస్తున్నామనే సాకుతో దానికి తిలోదకాలిస్తున్నది. మహిళలు, చిన్నారులతో సహా గాజాలోని ప్రజలపై మూకుమ్మడి హత్యలకు, తినడానికి తిండి, తాగడానికి నీరు లేక సామూహిక ఆకలిచావులకు పాల్పడేందుకు నెతన్యాహు ప్రభుత్వానికి అమెరికా పూర్తి స్వేచ్ఛ ఇచ్చింది. ఈ అమానవీయమైన వ్యూహానికి మోడీ ప్రభుత్వం సహకరిస్తోంది. ఇంతటి విపత్కర పరిస్థితుల్లో పాలస్తీనా ప్రజలకు మద్దతునివ్వకపోగా, పాలస్తీనియన్లకు మద్దతుగా, ఇజ్రాయిల్ దూకుడుకు వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనలు, ఆందోళనలను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం, రాష్ట్రాల్లోని బిజెపి ప్రభుత్వాలు అణచివేస్తున్నాయి. పాలస్తీనా ప్రజలకు మద్దతుగా సమావేశాన్ని నిర్వహించేందుకు యత్నించిన 92 ఏళ్ళ మాజీ జనసంఘ్ నేతను జమ్మూలో అరెస్టు చేయడం ఇందుకు తాజా ఉదాహరణ. కాల్పుల విరమణకు ఇజ్రాయిల్ ప్రభుత్వం తిరస్కరిస్తుండడం చూస్తుంటే గాజాలో యుద్ధం సుదీర్ఘంగా సాగేలా కనిపిస్తోంది. ఈ పరిస్థితుల్లో పాలస్తీనియన్లకు సంఘీభావంగా వామపక్షాలు, ప్రజాస్వామ్య శక్తులు తమ పోరాటాన్ని, ఉద్యమాలను మరింత విస్తరించి, ఉధృతం చేయాల్సిన అవసరం వుంది. ఈ అంశంపై మోడీ ప్రభుత్వ విప్లవ ప్రతీఘాత, మతోన్మాద వైఖరిని ఎండగట్టాల్సి వుంది.

# సంక్షేమం అణగదొక్కే కులాలకా? అణిచివేయబడ్డ కులాలకా?

భారత రాజ్యాంగం సంక్షేమం గూర్చి ప్రాథమిక హక్కుల అధ్యాయంలో ఆర్టికల్ 15(4),16(4) సామాజికంగా విద్యాపరంగా వెనుకబడిన వారికి మాత్రమే ప్రాతినిధ్య హక్కు మరియు సంక్షేమం అందజేయాలని తెలియ జేస్తుంది. లిరాజ్యాంగంలోని ఆర్టికల్ 38 ప్రకారం "రాష్ట్రం ప్రజల సంక్షేమాన్ని ప్రోత్సహించడానికి ప్రయత్నించాలి, సాధ్యమైనంత సమర్ధవంతంగా రక్షించడం ద్వారా, న్యాయం – సామాజిక ఆర్థిక మరియు రాజకీయ – జాతీయ జీవితంలోని అన్ని సంస్థలను విస్తరించే సామాజిక క్రమాన్ని." ఈ నిబంధన సంక్షేమ రాజ్య స్థాపనకు చేయాలి. భారత ప్రాథమిక హక్కుల రాజ్యాంగం (పార్ట్ %×××%) పౌరులందరికీ కొన్ని ప్రాథమిక మానవ మరియు పౌర హక్కులను కల్పించింది. ఈ ప్రాథమిక హక్కులు, రాష్ట్రానికి అందించబడిన ప్రాథమిక విధులు. ఇవి ఏ పౌరుడిని లేదా పౌరుల తరగతిని ఏ ప్రభుత్వం తిరస్కరించలేని హక్కులు. వివక్షతా పూరితమైన పరిపాలన గౌరవ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గారికే చెల్లింది139 బీసీ కులాల కోసం 56 కార్పొరేషన్లు, 60 ఎస్సీ కులాల కోసం మూడు కార్పొరేషన్ లు పెట్టి, 35 షెడ్యూల్ తెగలకు ఎలాంటి కార్పోరేషన్లు పెట్టకుండా, ఆయా కార్పొరేషన్ ద్వారా ఒక లోను కూడా ఇవ్వకుండా గౌరవ ముఖ్యమంత్రిగారు, వారు అనుకున్న సంక్షేమ రాజ్యాన్ని స్థాపించారు. దశాబ్దాల క్రితం రాజ్యాంగబద్ధంగా ప్రవేశపెట్టబడిన బహుజన సంక్షేమ స్కీములను ఏకపక్షంగా రద్దు చేయడం వారి విజ్ఞతకే చెల్లింది.

సంక్షేమం అంటే ఆధిపత్య కులాల సంక్షేమమేనా?

ది:27–జూన్–2020న %ూ్రా% బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్‌కు ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్‌లో రూ. 200 కోట్లు కేటాయించింది. ది:13–02–2020న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తన వాగ్దానాన్ని నిలబెట్టుకొని ఆర్యవైశ్య సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్‌ను స్థాపించారు. గత ప్రభుత్వం ఆర్యవైశ్య కార్పొరేషన్‌కు రూ. 30 కోట్లు మాత్రమే కేటాయించగా, ముఖ్యమంత్రిగారు రూ.100 కోట్లు వాగ్దానం చేశారు.ది:24 ఫిబ్రవరి 2022న, ఆంధ్ర ప్రభుత్వం ఈబీసీ నేస్తం పథకం కింద అగ్రవర్ణాల మహిళలకు రూ.15,000 అందించింది. 2021–22 ఆర్థిక సంవత్సరం నుండి, బ్రాహ్మణ, వైశ్య, వెలమ, క్షత్రియ, కమ్మ వంటి అగ్రవర్ణాలకు చెందిన ఆర్థికంగా వెనుకబడిన తరగతుల (ఇబిసిలు) నుండి 45–60 సంవత్సరాల వయస్సు గల మహిళలకు సంవత్సరానికి రూ. 15,000 సహాయం అందించ బడుతుంది. కాపు నేస్తం మరియు వైఎస్ఆర్ చేయూత తరహాలో రెడ్డి, మరియు ఇతర కులాలకు కొత్త పథకం ఇబిసి నేస్తమ్ రూ. 670 కోట్లు కేటాయించబడింది మరియు రాబోయే మూడేళ్లలో, లబ్ధిదారులకు సంవత్సరానికి రూ.15,000 ఆర్థిక సహాయం అందించబడుతుంది. ఇది నవంబర్‌లో అమలులోకి వచ్చింది. దీని వలన 6 లక్షల మంది ఆదిపత్య కులాల మహిళలకు ప్రయోజనం జరిగింది. ఫిబ్రవరి 25, 2016న, ఆంధ్రప్రదేశ్ మునుపటి ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబు నాయుడు 2016–17 రాష్ట్ర బడ్జెట్‌లో కాపు కార్పొరేషన్‌కు రూ.1,000 కోట్లు కేటాయించారు.కాపుల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు 2020 జూన్ 24న వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం 'పజా సంకల్ప పాదయాత్ర'లో ఇచ్చిన హామీలకు అనుగుణంగా కేవలం ఒక్క సంవత్సరంలోనే ?4,770 కోట్లు ఖర్చు చేసిందని శ్రీ జగన్ మోహన్ రెడ్డి చెప్పారు.%ూ=% కాపు నేస్తం 45–60 ఏళ్ల మధ్య ఉన్న మహిళలకు ?15,000 సహాయం అందిస్తుంది, వారు ఐదు సంవత్సరాల వ్యవధిలో మొత్తం ?75,000 పొందుతారు. కాపు, బలిజ, తెలగ, ఒంటరి వర్గాలకు చెందిన 2.36 లక్షల మందికి పైగా బియ్యం కార్డులు కలిగిన మహిళలకు ఈ పథకం కింద సుమారు ?354 కోట్లు పంపిణీ చేస్తున్నారు. అమ్మ ఒడి, వసతి దీవెన, విద్యా దీవెన, వాహన మిత్ర, చేదోడు, విదేశీ విద్యా దీవెన, కాపు నేస్తం తదితర పథకాల కింద 23 లక్షల మందికి పైగా కాపు సామాజిక వర్గానికి ? 4,470 కోట్లు అందించామని ముఖ్యమంత్రి తెలిపారు.

2021 మే నెలలో ఆంధ్ర ప్రభుత్వం ఆధిపత్య కులాలైన రెడ్డి, కమ్మ, క్షత్రియ సంక్షేమ కార్పొరేషన్లను వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ జారీ చేసింది.ఈ కార్పొరేషన్లకు కేటాయించిన నిధులను ఆయా వర్గాల ఆర్థికంగా వెనుకబడిన వారిని ఆదుకునేందుకు వినియోగిస్తామని ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొంది. రెడ్డి, కమ్మ మరియు క్షత్రియ (లేదా రాజు) కమ్యూనిటీలు రాష్ట్రంలో సామాజికంగా మరియు ఆర్థికంగా ఆధిపత్యంలో ఉన్న వర్గాలలో ఉన్నాయి మరియు ఓపెన్ కేటగిరీ (%రాజ%) కిందకు వస్తాయి.ఎగువ శూద్రులు బ్రాహ్మణ, వైశ్య, క్షత్రియులతో కలిసి ఆధిపత్య కులాలుగా మారి తమ సంక్షేమాన్ని గొప్పగా అభివృద్ధి చేసుకుంటున్నారు. బహుజనులుగా ఆదిపత్య కులాల అమిత అభివృద్ధిని మేముఅడ్డుకోలేము. కారణం బహుజనులు పాలక కులాలుగా కాలేకపోవడం.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 75 శాతం పైగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ ప్రజలు ఆర్థికంగా ఎదగనీయకుండా, విద్యా పరంగా జిఓ 77 ద్వారా ఉన్నత విద్య పొందకుండా, కనీసం పిల్లలను బెస్ట్ ఎవైలబుల్ స్కీం ద్వారా ఇంగ్లీష్ మీడియంలో కూడా చదవనీయకుండా, నిరంకుశ పరిపాలనతో సామాజికంగా ప్రజల హక్కులను నిర్వీర్యం చేస్తూ, దేశంలో ఏ ముఖ్యమంత్రి రద్దు చేయమని బహుజన సంక్షేమ స్కీములను ఏకపక్షంగా రద్దు చేసిన ఘనకీర్తి గౌరవ జగన్ మోహన్ రెడ్డి గారికి దక్కుతుంది.దేశంలో గౌరవ ప్రధాన మంత్రి మోదీ గారు తన సొంత గుజరాతీ వ్యాపారుల బ్యాంకు రుణాలను పూర్తిగా రద్దు చేసి, ప్రభుత్వ రంగాన్ని పూర్తిగా అమ్మేశారు. అలాగే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగారు కూడా సంక్షేమము అంటే కేవలం ఆధిపత్య కులాల సంక్షేమమని అని భావిస్తూ, గత టీడీపీ, ఇప్పటి వైసీపీ పాలనలో రాష్ట్రాన్ని 7 లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టి వేశారు. రిజర్వేషన్ లేని నూతన విద్యా చట్టాన్ని, ఆంధ్రప్రదేశ్ లో అమలు చేయడం అనేది అత్యంత దారుణమైన విషయం. తమిళనాడు, కేరళ ముఖ్యమంత్రులు నూతన విద్యా చట్టాన్ని పూర్తిగా పక్కకు పెట్టేశారు. ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ గారు రాష్ట్రాన్ని ఒక్క రూపాయి అప్పు లేకుండా చేశారు. విద్య, వైద్యంలో వారి పరిపాలన దేశానికి ఆదర్శవంతంగా ఉంది.

"ఎ.పిలో వైసీపీ సంక్షేమం ఎస్సీఎస్టీల పట్ల ఏ విధంగా ఉందో బేరీజు వేయండి."

2020–21లో మొత్తం బడ్జెట్: రూ.2,24,789.18కోట్లు.

%ాజ% సబ్ ప్లాన్:రూ.14218.76 కోట్లు,

%ూ% సబ్ ప్లాన్:రూ.4,814.5 కోట్లు

2021–22లో మొత్తం బడ్జెట్: రూ:2,29,779.27కోట్లు.

%ాజ% సబ్ ప్లాన్:రూ:17,403.14కోట్లు,

%ూ% సబ్ ప్లాన్:రూ.6,131.24కోట్లు.

2019–2020 మొత్తం బడ్జెట్లో రూ.15,000/– వేల కోట్లు కేటాయించి, రూ.4378/– కోట్లు ఖర్చు చేశారు.2020 – 2021 బడ్జెట్ లో రూ. 15,735/– కోట్లు కేటాయించి అందులో రూ.7525/ – కోట్లు ఇతర కార్యక్రమాల కోసం మళ్ళించారు. అంటే కేవలం రూ.8210/ – కోట్లు మాత్రమే ఖర్చు చేశారు.గత టిడిపి ప్రభుత్వం ఎస్సీ,ఎస్టీలకు 54,420 కోట్లు రూపాయలు కేటాయించి, కేవలం 11,851 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టారు. ఏ ఒక్క వైసిపి, టిడిపి ఎస్సీ,ఎస్టీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, లేక ఇతర ప్రజాప్రతినిధులు ఈ దోపిడి గూర్చి మాట్లాడలేక పోయారంటే, మన ప్రజాప్రతినిధులు ఎంత అధమ స్థితిలో ఉన్నారో ప్రజలు గమనించాలి.దురదృష్టవశాత్తు కొంతమంది ఎస్సీలు ఎలక్ట్రానిక్ మీడియాలో విశ్లేషకులుగా వెళ్లి టిడిపి పాలనలో ఎలాంటి దోపిడీ జరగలేదని, చంద్రబాబు నాయుడుని పరిశుద్ధుడైన పౌలుగా మార్చే సూక్తి ముక్తావళి ప్రవచన వచనాలు మానుకోవాలి.""స్పెషల్ కాంపోనెంట్ ప్లాంట్ ద్వారా ఎస్సీ, ఎస్టీలకు ఎలాంటి ప్రయోజనాలు అందడం లేదు.""

ఎస్సీ ఎస్టీ రుణాలు రద్దు కావు, కానీ బడా పారిశ్రామికవేత్తల రుణాలు, పన్నులు 6 లక్షల కోట్లు మోడీ అమిత్షాలు తమ వర్ణాల కోసం రుణమాఫీ చేసుకున్నారు.కేంద్ర ప్రభుత్వం 2018–19లో అరుణ్ జైట్లీ ఎస్సీలకు 56,619 కోట్లు, ఎస్టీలకు 39,135 కోట్లు మాత్రమే కేటాయించారు. వాస్తవంగా జనాభా దామాషా ప్రకారం ఎస్సీలకు 1,14,717 కోట్లు కేటాయించాల్సి ఉండగా, ఎస్టీలకు 54676 కోట్లు నిబంధనల ప్రకారం కేటాయించాలి. కేటాయింపులే చాలా తక్కువగా చేస్తూ ఇప్పుడు ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ స్కీమ్స్ కోసం ఎస్సీలకు 28,697.74 కోట్లు, ఎస్టీలకు 19623 కోట్లు మాత్రమే కేటాయించటం అత్యంత దురదృష్టకరమైన విషయం.

ఈ దుర్మార్గతపైన జాతీయ ఎస్సీ కమిషన్ గాని, జాతీయ ఎస్టీ కమిషన్ గాని, మానవ హక్కుల కమిషన్ గాని నోరు మెదపడం లేదు. నోరు మెదపవలసిన లోకసభలో ఉన్న 134 మంది ఎస్టీఎస్సీ ఎంపీలు మాత్రం గుర్రుపెట్టి నిద్ర పోతున్నారు.వైసిపి పాలనలో ఒక్క రూపాయి కూడా ఉప ప్రణాలికకు ఖర్చు చేయలేదు. పైగా ఎస్సీఎస్టీ అభివృద్ధి కోసం కేంద్రం ఇచ్చిన నిధులు దారి మళ్లించి వాడుకున్నారు. ఉచిత భూమి పంపిణీ చేయకపోగా ఎస్సీ,ఎస్టీలకు గత ప్రభుత్వాలు ఇచ్చిన భూములను కూడా లాక్కొని ఇళ్ల స్థలాలకు పంచారు. ఎస్సీఎస్టీ, చెల్లెమ్మల వివాహానికి 'వైఎస్ఆర్ పెళ్లికానుక'గా రూ.1,00,000 ప్రకటించి,ఈ రెండున్నర ఏళ్లలో ఒక్కరికీ ఇవ్వకపోగా గతంలో ధరఖాస్తు చేసుకున్నవారికి, మంజూరైన వారికి కూడా జమచేయలేదు.గిరిజనులకు ప్రత్యేక జిల్లాలు ఏర్పాటు చేసి అందులో ప్రత్యేకంగా యూనివర్సిటి, మెడికల్ కాలేజీలు ఇంజనీరింగ్ కాలేజీలు ఏర్పాటు చేస్తాం. ప్రతి ఐటిడిఎ పరిధిలోను ఒక సూపర్స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మిస్తాం.500 మంది జనాభా ఉన్న ప్రతి తండాను, గూడెంను పంచాయితీగా మారుస్తాం. పోడు భూములను సాగు చేసుకునే గిరిజన రైతులకు యాజమాన్య హక్కు కల్పిస్తూ ఫారెస్ట్ రైట్స్ యాక్ట్ 2006 ప్రకారం గిరిజనులకు వైఎస్ఆర్ ఇచ్చిన హామీలను నెరవేరుస్తాం. ప్రమాదవశాత్తు ఎస్సీ,ఎస్టీలు మరణిస్తే వారి కుటుంబానికి వైఎస్ఆర్ బీమా ద్వారా రూ. 5,00,000 ఇస్తాం. కాని 2020–21లో ప్రభుత్వం చెల్లించాల్సిన నామమాత్రపు బీమా రుసుము చెల్లించక అనేక వేలమందికి చెందాల్సిన బీమా సొమ్ములో రూపాయి కూడా రాలేదు. ఆ బీమా సొమ్ము చెల్లించినట్లైతే సాధారణ మరణాలతో పాటు కోవిడ్ మరణాలకు కూడా బీమా కంపెనీలు పరిహారం చెల్లించవలసి ఉండేది. ఎస్సీ,ఎస్టీ లబ్ధిదారులకు ఇచ్చిన అసైన్మెంట్ భూములు, పట్టా భూములకు ఇస్తున్న విలువకంటే తక్కువ పరిహారం ఇవ్వడాన్ని పూర్తిగా అరికడతాం. అలా తీసుకునే భూములకు, పట్టా భూములకు ఇచ్చే పరిహారం కంటే 10% ఎక్కువ పరిహారం ఇచ్చేట్టుగా చట్ట సవరణ చేస్తాం.వైసీపీ పార్టీ తమ మేనిఫెస్టోని భగవద్గీత, బైబిల్, ఖురాన్ తో పోల్చి, తాము అధికారంలోకి వస్తే బహుజనుల సంక్షేమాన్ని పూర్తిగా తొలగిస్తామని మేనిఫెస్టోలో చెప్పకుండా ఓట్లు వేయించుకొని, తద్వార అధికారంలోకి వచ్చి బహుజనుల సంక్షేమాన్ని పూర్తిగా రద్దు చేయడం నమ్మక ద్రోహమే అవుతుంది.

**బేతాళ సుదర్శనం**

# నక్సలిజంపై ఏది దారి..?

వామపక్ష తీవ్రవాదం.. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు నిండిన ఈ సంర్భంలో.. ట్రిలియన్ డాలర్ల వ్యవస్థ గురించి కలలుకంటున్న నేపథ్యంలో దీని గురించి ఇంకా సమీక్షించాల్సి రావడం దురదృష్టకరమే. ఇప్పటికే బాగా తగ్గిందని, రెండేళ్లలో పూర్తిగా నిర్మూలిస్తామని సంకల్పం చెప్పుకున్నామంట.. దాని మూలాలు మాత్రం అలానే ఉన్నాయని భావించక తప్పదు. వామపక్ష తీవ్రవాదాన్ని రెండేళ్ళల్లో పూర్తిగా అంతమొందిస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. వామపక్ష తీవ్రవాదం వల్ల ఎన్నో కుటుంబాల వారు అనాథలవుతు న్నారని ఆయన అన్నారు. 2020తో పోలిస్తే 2022లో వామపక్ష తీవ్రవాదం బాగా తగ్గిందన్నారు. ఆయన మాటల్లో అర్ధ సత్యం ఉంది. మన దేశంలో వామపక్ష తీవ్రవాదానికి ఆరు దశాబ్దాల చరిత్ర ఉంది. నక్సలిజం అనే పేరు బెంగాల్‌లోని నక్సల్‌బరి ప్రాంతానికి చెందిం ది. అక్కడ పుట్టిన నక్సలిజం తర్వాత దేశమంతటా వ్యాపించింది.తెలంగాణలో ఎక్కువ విస్తరించింది. ఆ తర్వాత ఇప్పుడు జార?ండ్, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో మిగిలి ఉంది. తెలంగాణలో పూర్తిగా అదుపులో ఉంది. భూస్వాముల బారి నుంచి గిరిజనులు, వ్యవసాయ కూలీలను రక్షించడానికి వామపక్ష తీవ్రవాదులు సాయుధ పోరాటా న్ని ప్రారంభించారు. దానికే నక్సలిజం అనే పేరు వచ్చిం ది. తదనంతర కాలంలో మావోయిస్టు పార్టీగా పేరు మారింది. భూస్వాములను అంతమొందిస్తే వ్యవసాయ కూలీలకు, నిరుపేదలకు విముక్తి లభిస్తుందన్నది మావోయిస్టుల వాదన. అయితే, వ్యవస్థలో లోపాలను సరిదిద్ద కుండా వ్యక్తులను అంతమొందించడం వల్ల ప్రయోజ నం ఏమిటని మేధావుల ప్రశ్న. మావోయిజం (నక్సలి జం) వ్యాప్తి పెరిగిన కొద్దీ, భూస్వాముల వేధింపులు పెరిగిపోతున్నాయి. ఆర్థిక అసమానతలు పెరిగి పోతు న్నాయి. మావోయిస్టులను అణచివేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేల కోట్ల రూపాయిలు ఖర్చు చేస్తు న్నాయి. ఇప్పటికి వేలమంది పోలీసులు బలి అయ్యారు. ఈ ఉద్యమం పేరు చెప్పి, అటు మావోయిస్టుల్లోను, ఇటు పోలీసుల్లోనూ ప్రాణాలు కోల్పోతోంది బలహీనవర్గాల వారే.పోలీసు శాఖలో రిస్క్ ఉన్న ఉద్యోగాల్లో ఎక్కువ మంది బలహీనవర్గాల వారే చేరుతున్నారు. మావోయి స్టుల కాల్పుల్లో సమిధలు అవుతున్నదీ వారే. అలాగే, నక్సలైట్ ఉద్యమంలో చేరిన వారిలో అధికంగా బలహీన



వర్గాలకు చెందినవారే ఉంటున్నారు. పోలీసుల ఎదురు కాల్పుల్లో మరణిస్తున్నదీ ఎక్కువగా వారే. దేశంలో సమాచార సాంకేతికత (ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ) పెరిగిన తర్వాత నక్సలైట్ ఉద్యమానికి ఆదరణ తగ్గిన మాట నిజమే.ఇంజనీరింగ్, మెడిసిన్‌లలో పట్టాలు సంపాదిం చినా ఉద్యోగాలు రాకపోవడంతో గతంలో ఆ పట్టభద్రు లు నక్సలైట్ ఉద్యమంలో చేరేవారు. ఇప్పుడు ఐటి లో పట్టాలు సంపాదించిన వారికి క్యాంపస్ సెలక్షన్స్ పేరిట వెంటనే ఉద్యోగాలు వస్తున్నాయి. అందువల్ల ఉద్యోగార్థు ల సంఖ్య బాగా తగ్గింది. ప్రభుత్వోద్యోగాల కన్నా ఇప్పు డు ప్రైవేటు సంస్థల్లో మంచి జీతాలు, ఉద్యోగాభివృద్ధి అవకాశాలు ఎక్కువగా ఉంటున్నందున కూడా ఉద్యోగా ర్థుల సంఖ్య తగ్గింది. ఈ కారణంగా యువకులు, విద్యా ధికులు మావోయిస్టు ఉద్యమంలోకి రావడం కూడా తగ్గింది. మావోయిస్టు ఉద్యమం పల్చబడటానికి అసలు కారణం అది. అయితే, ప్రభుత్వం అనుసరిస్తున్న అణచి వేత వైఖరివల్ల తీవ్రవాదం తగ్గిందని ప్రభుత్వం వాదిస్తోంది. అది పూర్తిగా ని జం కాదు. వామపక్ష ఉద్యమాన్ని ఎదుర్కోవడానికి అణచివేత చర్యలే ఏకైక మార్గమని ప్రభుత్వం గతంలో అను కునేది. వాటి వల్ల ప్రయోజనం లేదనీ, మావోయిస్టులకు నచ్చజెప్పి జనజీవన స్రవంతి లోకి తీసుకుని రావాలన్న వ్యూహాన్ని కొంత కాలం అమలు జేసింది.

# 5న పర్చూరులో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

**తెలుగు దేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఏలూరి**

**ఏలూరి ట్రస్ట్,నోవా అగ్రి గ్రూప్ ఆధ్వర్యంలో శంకర్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో క్యాంప్**



పర్చూరు, నవంబర్ 03, ప్రజాపాలన : పర్చూరు వై.ఆర్. హైస్కూల్లో, ఈనెల 5న నిర్వహిస్తున్న ఉచిత మెగా కంటి వైద్యశిబిరాన్ని, ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని, తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పిలుపు నిచ్చారు. ఏలూరి నాగేశ్వరరావు చారిటబుల్ ట్రస్ట్, నోవా అగ్రి గ్రూప్ ల సంయుక్త ఆధ్వర్యంలో, శంకర్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో, పర్చూ రు వై.ఆర్. హైస్కూల్‌లో, ఈ నెల 5వ తేది ఆదివారం ఉదయం 8గంటల నుంచి ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలకు ఎలాం టి ఇబ్బందులు లేకుండా, అన్ని ఏర్పాట్లు చేపట్టామన్నారు. నియోజకవర్గ ప్రజలందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని, విజయవంతం చేయాలన్నారు. కంటి వైద్య శిబిరంలో బిపి, షుగర్, రక్త పరీక్షలు చేపడతారని, అనంతరం కంటి వైద్య పరీక్షలు చేస్తారని తెలిపారు. అవసర మైన వారికి, శంకర్ కంటి ఆసుపత్రిలో శస్త్ర చికిత్సలు అందిస్తారన్నారు. ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

## క్రిస్టియన్ సెల్ నియోజకవర్గ అధ్యక్షుని గా వెంకట్రావ్



పర్చూరు, నవంబర్ 03, ప్రజాపాలన : క్రిస్టియన్ సెల్ పర్చూరు నియోజకవర్గ అధ్యక్షునిగా, మార్టూరుకు చెందిన తుమ్మల వెంకట్రావ్ నియమితులయ్యారు. ఈ మేరకు తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. మార్టూరులో పార్టీ అభివృద్ధికి, వెంకట్రావ్ కీలకంగా పని చేశారు. క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా, గతంలో తెలుగు దేశం పార్టీ మండల కార్యదర్శిగా వెంకట్రావ్ పనిచేశారు. వెంకట్రావ్ నియామకం పట్ల, తెలుగుదేశం పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ, వెంకట్రావ్ కి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యే ఏలూరికి, వెంకట్రావ్ కృతజ్ఞతలు తెలిపారు.

# కరువు కోరల్లో ఆంధ్ర ప్రదేశ్

**తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు, పర్చూ రు ఎమ్మెల్యే ఏలూరి**

**కాటేసిన కరువుతో అన్నదాత ఏ"కరువు", ప్రభుత్వానికి పట్టని అన్నదాతల గోడు**

**జిల్లాలో తీవ్ర కరువు ఛాయ లు, కార్లు దిగి చూసే తీరికలేని అమాత్యులు**

**అన్నపూర్ణగా పేరుగాంచిన కృష్ణాడెల్టా లోను బీటలు వారిన మాగాణి**

**ఎకరాకు రూ 30 వేలు చొప్పు న నష్ట పరిహారం చెల్లించాలి**



పర్చూరు, నవంబర్ 03, ప్రజాపాలన : అన్నపూర్ణగా పేరుగాంచిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో, తీవ్ర కరువు ఛాయలు అలుముకున్నాయని, రూ.లక్షలాది రూపాయలు వెచ్చించి, పెట్టుబడులు దక్కని దుస్థితి నెలకొన్నా, ప్రభుత్వం అన్నదాతలను ఆదుకునేందుకు కనీస చర్యలు చేపట్ట కపోవడం శోచనీయమని, తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆవేదన వ్యక్తం చే శారు. ఈ మేరకు ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ,రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నా, వైసిపి ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా 470 మండలాల్లో కరువు ఛాయలు అలుముకున్నాయని, కానీ వైసీపీ ప్రభుత్వం 103 మండ లాలను మాత్రమే ప్రకటించిందని ధ్వజమెత్తారు. వర్షా లు లేక, సాగునీరు రాక, వేసిన పంటలు కళ్ళ ముందే ఎండిపోతుంటే రైతులు కన్నీరు మున్నీ రు అవుతున్నారన్నారు. మాగాణిపైరు బీటలు వారుతోందని, వేలాది ఎకరాలలో పంటలు కళ్ళ ఎదుట మాడిపోతున్నాయన్నారు. మిర్చి పంటను కాపాడుకునేందుకు, రైతులు అదనంగా రూ.10 వేలకు పైగా వెచ్చించి, ట్యాంకర్ల ద్వారా నీటిని తరలిస్తూ, భగీరథ ప్రయత్నం చేస్తున్నారన్నారు. వేసిన పంటలకు నీరు లేక రైతులు, పనులు లేక కూలీలు, ఆకలితో వలస బాట పడుతున్నారని, ప్రభు త్వం వారిని ఆదుకోవ డంలో పూర్తిగా విఫలమైందన్నారు. అప్పుల ఊబిలో కూరుకుపో యిన రైతన్నలను ఆదుకునేందుకు, ప్రభుత్వం ఎలాంటి సహాయక చర్యలు చేపట్టక పోవడం దారుణం అన్నారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా గాలి కొదిలేసిన జగన్ సర్కారు, రైతుల జీవితాలతో చెలగాట మాడుతోం దన్నారు. అన్నపూర్ణ గా బాసిల్లుతున్న కృష్ణా డెల్టా పరిధిలో, మాగాణి భూములు బీటలు వారి ఎండిపోతున్న పరిస్థితులు తలెత్తాయన్నారు. ఇ లాంటి పరిస్థితులు రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేవన్నారు. ఒక వైపు కరువు ఛాయల్లో ఉన్న రైతాంగాన్ని ఆదుకోకపోగా, పంటలు వేసి, సాగులో ఉన్న భూములకు నీరు అందించే పరిస్థితి లేదన్నారు. డ్రాట్ మాన్యువల్ కేంద్రప్రభుత్వ మార్గదర్శకాలు ప్రకారం, క్రాప్ వెదర్ వాచ్ గ్రూప్ కు సంబంధించి, ప్రతివారం రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్రంలోని వర్షాభావ పరిస్థితి సాగునీరు, విద్యుత్.. వేసిన పంటలపై సమీక్ష చేయాలని, కానీ జగన సర్కార్ మొ త్తం వ్యవసాయ రంగాన్నే గాలికి వదిలేసిందన్నారు. సాగునీటి సరఫరా విషయంలో, ఈ ప్రభు త్వానికి ఎలాంటి అవగాహన లేదన్నారు. ప్రభుత్వం ప్రణాళిక లోపం, అసమర్ధ నిర్ణయాల కారణంగా, పంటలన్నీ నిలువునా ఎండిపోతున్నాయన్నారు. పట్టిసీమ ద్వారా సస్య శ్యామలమ య్యే, ఈ ప్రాంతాన్ని గాలికి వదిలేసారని మండిపడ్డారు. సరైన ప్రణాళికలతో పట్టిసీమ ద్వారా, కొమ్మమూరు ఆయకట్టుకు సాగు నీరు అందించవచ్చున్నారు. ఎస్ఆర్ఎఫ్ కింద, కేంద్రం జులైలో రాష్ట్రానికి రైతులకు రూ.500కోట్లు ఇస్తే,అందులో ఒక్క రూపాయి కూడా వ్యవ సాయ రంగానికి, తాగు నీటి వసతి కల్పనకు కేటాయించలేదన్నా రు. గతంలో తెలుగుదేశం ప్రభు త్వం, వర్షాభావ పరిస్థితులు తలెత్తినప్పుడు, రైతుల్ని ఆదుకో వడానికి అనేకచర్యలు చేపట్టిందన్నారు. జిల్లా వ్యాప్తంగా కరువు విలయ తాండవం చేస్తుందన్నారు. ప్రస్తుతం అమాత్యులకు, కారు దిగి, పంటలను చూసే సమయం గానీ, రైతులతో మాట్లాడే తీరిక గాని లేదన్నారు. తక్షణమే ప్రభుత్వం, జిల్లాలోని పర్చూరు, అద్దంకి, చీరాల ని యోజకవర్గాలలో తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయన్నా రు. దీనికి తోడు ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా, ఉన్న పంటలకు నీరు అందించే పరిస్థితి లేక పోవడంతో, రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా మారిందన్నారు. ప్రభుత్వం తక్షణమే రైతాంగాన్ని ఆదుకునేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎకరాకు 30 వేల నష్ట పరిహారం అందించి, నూరు శాతం రాయితీ పై రబీ సాగుకు ఎరువులు, విత్త నాలు అందించి, అన్నదాతలకు అండగా నిలవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణ పనుల్లో మరో ముందడుగు..

(మొదటి పేజీ తరువాయి)

ప్రతిష్టాత్మక ఎయిర్ పోర్ట్ లను నిర్మించిన జీ ఎం అర్

మన దేశంలో ఢిల్లీ, హైదరాబాద్ మరియు గోవా ఎయిర్ పోర్ట్ లను నిర్మించిన జీ ఎం అర్ చేపట్టిన నాల్గవ ప్రధాన విమానాశ్రయం భోగాపురం. ఈ ప్రాజెక్ట్ మూడు దశల్లో అమలు చేయబడుతుంది, మొదటి దశలో సంవత్సరానికి 6 మిలియన్ల మంది ప్రయాణీకులను హ్యాండిల్ చేసేందుకు వీలు కల్పిస్తుంది. పూర్తిగా పనిచేసిన తర్వాత, ఇది 40 మిలియన్ల మంది ప్రయాణీకులను నిర్వహించడానికి రూపొందించబడింది. మే 3న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. మొదటి దశ ప్రాజెక్టును రూ. 5 వేల కోట్లతో చేపడుతున్నారు. ఇటీవలే ఫైనాన్షియల్ క్లోజర్ కూడా పూర్తయింది. %జూాజ% బిడ్ ఖరారు అయినందున, అంతర్గత అనుమతులు పొందిన తర్వాత అవార్డు ఇచ్చే ప్రక్రియ జరుగుతుంది. ఆర్ అండ్ ఆర్ ప్రక్రియ పూర్తిగా పూర్తయింది. విమానాశ్రయ భూమిపై హక్కు మంజూరు ప్రక్రియ పురోగతిలో ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం కంపెనీ రూ.4,000 కోట్ల రుణాన్ని పొందింది. అన్ని భాగస్వామ్య ఆర్థిక సంస్థల నుండి అనుమతి పొందినట్లు చట్టబద్ధమైన ఏజెన్సీలకు తెలియజేసింది.

# బిజెపితో వైసిపి దోస్తీ ఓటమికి దారి తీస్తుంది



ప్రజా పాలన. బద్వేల్ ప్రతినిధి: జిల్లా అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసింది ఏమీ లేదు. పట్టణంలోని స్లమ్ ఏరియా లభివృద్ధికి నిధులు ఖర్చు పెట్టాలి. సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్. శుక్రవారం ఉదయం 10 గంటలకు బద్వేల్ స్థానిక కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య భవనం నందు భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్), సిపిఎం బద్వేల్ పట్టణ కమిటీ సమావేశం కామ్రేడ్ పసుపుల మోక్షమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నవంబర్ 15 చలో విజయవాడ సిపిఎం "ప్రజారక్షణ భేరి" ప్రజా చైతన్య "బహిరంగ సభ" వాల్ పోస్టర్లు సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్,సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏ, రామ్మోహన్, బద్వేల్ పట్టణ కార్యదర్శి కే.శ్రీనివాసులు, బద్వేల్ పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు పటాన్ చాంద్ భాష , కే.నాగేంద్రబాబు, పట్టణ కమిటీ సభ్యులు షేక్.మస్తాన్, జి.అనంతమ్మ, ఎలక రాజు తదితరులు పాల్గొన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్), సిపిఎం కడప జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ మాట్లాడుతూ... నేడు దేశంలో బిజెపితో దోస్తీ చేసిన ఏ ప్రాంతీయ పార్టీ కూడా మనుగడ కొనసాగించలేదని, బిజెపి భావసారుపేత కలిగిన శివసేన ఆంటీ పార్టీలు కూడా, నేడు బిజెపి అవకాశవాద పార్టీ ఫిరాయింపుల కుట్రలతో విసిగి వేసారి ఎన్.డి.ఏ కూటమి వదిలి, ప్రతిపక్షాల ఇండియా కూటమిలో చేరిందని వారు గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్లో వైసిపి ప్రభుత్వం ప్రజలు వారికిచ్చిన 22 ఎంపీ సీట్లు 13 రాజ్యసభ సీట్లు బిజెపి ఢిల్లీ గద్య ఎక్కడానికి ఇచ్చి బిజెపితో దోస్తీ చేసిందని, దేశంలో అనేక రాష్ట్రాలలో దోస్తీ చేసిన ప్రాంతీయ పార్టీల ఎమ్మెల్యేలను, ఎంపీలను బిజెపిలోకి పార్టీ కిరాయింపులకు పాల్పడి మిత్ర ద్రోహం చేసి, ప్రాంతీయ పార్టీలు లేకుండా బిజెపి చేసిందని, రాష్ట్రంలో మైనార్టీలు, దళితులు దూరమయ్యారని వైసిపి ఓటమికి దారితీస్తుందని, వైసిపి ఎమ్మెల్యేలు బిజెపి వేసిన ఉచ్చులో పడిపోతున్నారని తెలిపారు. అనంతరం రాష్ట్రంలో టిడిపి, బిజెపి మధ్య పోటీ ఉంటుందని వైసీపీని కనుమరుగు చేయటానికి బిజెపి కుట్రలు చేస్తోందని వారు జోషం చెప్పారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వానికి, రాష్ట్రంలో ఊడిగం చేయడం తప్ప రాష్ట్ర అభివృద్ధి, జిల్లా అభివృద్ధి వైసీపీ ప్రభుత్వం పట్టించుకోవడంలేదని, వైసీపీ దృష్టిలో అభివృద్ధి అంటే బటన్ నొక్కడం, నవరత్నాలే అని అన్నారు. నిజమైన అభివృద్ధి అంటే అసమాంతం లేని అభివృద్ధి అంటే నూటికి 65 శాతం ప్రజల జీవించేది గ్రామీణ ప్రజల ప్రధాన జీవనాధారం వ్యవసాయం, పాడి పరిశ్రమ అభివృద్ధిని, పట్టణ ప్రాంతాల్లో ఉండే అసంఘటిత కార్మికుల ఉపాధి అవకాశాలు మెరుగుపరచడం అని, చదువుకున్న నిరుద్యోగ యువతకు శాశ్వత ఉద్యోగ అవకాశాలు కల్పించడమేనని దళితులు మైనార్టీలకు వెనుకబడిన తరగతులకు ఏర్పాటుచేసిన కార్పొరేషన్ లకు నిధులు కేటాయించి, వాటిని ఖర్చు చేయటం వాటి ద్వారా ఆయా వర్గాల ప్రజలకు స్వయం ఉపాధి అవకాశాలు పెంపొందించమని వైసిపి ప్రభుత్వం విస్మరించిందన్నారు. బద్వేలు మున్సిపాలిటీ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులు130 కోట్లు ఖర్చు వివరాలు పట్టణ ప్రజలకు శ్వేత పత్రం ద్వారా తెలియజేయాల్సిన అవసరం ఉందని వైసిపి సొంత పార్టీ కౌన్సిలర్లే ఈ విషయాన్ని అడుగుతున్నారని వారి పార్టీ వారికి వారి పార్టీ కౌన్సిలర్లకు కూడా సమాధానం చెప్పలేని పరిస్థితుల్లో మున్సిపాలిటీ పాలకవర్గం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎం చిన్ని పట్టణ నాయకులు షరీఫ్ ఆంజనేయులు సురేంద్ర సురేష మహిళా సంఘం నాయకురాలు గౌతమి మస్తాన్ బి బాలమ్మ సిఐటియు నాయకులు సుబ్బరాయుడు, రాజగోపాల్ , కొండయ్య , కార్యకర్తలు భాష వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

# మనం బాగుండాలంటే బాబు గెలవాల్సిందే..



పల్నాడు జిల్లా .నరస రావుపేట .నవంబర్ 3 (ప్రజాపాలన ప్రతినిధి): అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా పౌర హక్కుల్ని గౌర వించి,ప్రజల్ని అభివృద్ధి వైపు నడిపించే చంద్ర బాబును గెలిపిం చుకుంటేనే మనం, మన భవిష్యత్ తరాలు అభివృద్ధి చెందుతాయని తెలుగుదేశం పార్టీ నరసరావుపేట యువ నేత డా.చదలవాడ ఆదిత్య పేర్కొన్నారు.నరసరావుపేట పట్టణంలోని స్థానిక 09వ వార్డులో నిర్వహించిన బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా డా.చదలవాడ ఆదిత్య హాజరయ్యారు.తెలుగుదేశం ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల గురించి ఇంటింటికి వివరించారు.మహాశక్తిలో భాగంగా తల్లికి వందనం,ఆడబిడ్డ నిధి,ఏటా మూడు ఉచిత సిలిండర్లు,ఉచిత బస్సు ప్రయాణం,పథకాలు,యువగళం నిరుద్యోగ భృతి,అన్నదాత సుఖీభవ,ఇంటింటికీ సురక్షిన తాగునీరు,బీసీ రక్షణ చట్టం గురించి వివరించారు.ఈ సందర్భంగా డా.చదలవాడ ఆదిత్య మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యధికంగా యువత ఉన్న మన దేశం ముందుకు సాగాలంటే ప్రతి ఒక్కరూ ప్రజ సంక్షేమం కోసం పాటుపడాలన్నారు.యువత రాజకీయాల్లోకి వచ్చినపుడే రాష్ట్రం బాగుపడుతుందని,వినూత్నమైన ఆవిష్కరణలు,వినూత్న ఆలోచనలతో మరింత ముందుకు సాగే అవకాశం ఉంటుందన్నారు.గ్రామ స్థాయిలో ఉండే తెలుగుదేశం పార్టీ కార్యకర్తల్లో అధిక శాతం యువకులే ఉన్నారన్నారు.వారంతా ఏకమై పిడికిలి బిగించి ముందుకు కదిలితే తెలుగుదేశం పార్టీ గెలుపును అడ్డుకునేదెవరు అని ప్రశ్నించారు.మన భవిష్యత్తు మన చేతుల్లోనే ఉందని పిలుపునిచ్చారు.ఈమధ్యనే జగన్ రెడ్డి రాజకీయ సలహాదారుడైన ప్రశాంత్ కిశోర్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ఎండగట్టాడని అన్నారు.తెలుగుదేశం పార్టీ ప్రకటించిన సూపర్ సిక్స్ మేనిఫెస్టో ప్రకటించిది చూశాక జగన్ రెడ్డికి మతి భ్రమించింది అన్నారు.ఏం చేయాలో తెలియని దిక్కుతోచని స్థితిలో పిచ్చి పిచ్చి నిర్ణయాలతో రాష్ట్రాన్ని నేరాలకు కేంద్రంగా మార్చాడుని మండిపడ్డారు.ఇలాంటి తుగ్లక్ ముఖ్యమంత్రిని గద్దె దించి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవడం ద్వారా ప్రజాస్వామ్య బద్ధమైన ప్రభుత్వాన్న ఏర్పాటు చేసుకుందామని డా.ఆదిత్య ప్రజలకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వాసిరెడ్డి రవి,మన్నన్ షరీఫ్,డా.పీర్,రహమాన్,సైదవాలి,రాఫీఉద్దీన్,మస్తాన్ వాలి తదితరులు పాల్గొన్నారు.














## విద్యార్థుల్లో ఆనందం.. హర్షం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు



ప్రజా పలన ప్రతినిధిప్ర కాసినాయన మండలం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుల పనితీరును మెచ్చుకుంటున్న గ్రామస్తులు........ శ్రీ అవధూత కాశీనాయన మండలం, నరసాపురం గ్రామపంచాయతీ లోని మూలపల్లె గ్రామం లో మండల ప్రాథమిక పాఠశాల లొ విద్యార్థులకు ఉపాధ్యాయులు చంద్ర శేఖర్, భవాని మంచి ప్రతిభ తొ కూడిన విద్య, భోజనాలు, సాయంత్రం పూట ఆటల పోటీలలో భాగంగా వివిధరకాల ఆటలు అలాగే సాంస్కృతిక కార్యక్రమం లలో కోలాటం వంటి కార్యక్రమాలు నిర్వహించడం ఆయా గ్రామాలలోని విద్యార్థుల తల్లి దండ్రులు సంతోషం వ్యక్తం చేసారు. ఈ పాఠశాల ప్రతిభని చూసి ప్రైవేట్ పాఠశాలలో చదువు విద్యార్థులు, పక్క గ్రామాల విద్యార్థులు స్కూల్ లొ చేరడం విశేషం.

## గోపవరం, వేల్పుచర్ల గ్రామాలలో సబ్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు



ముసునూరు, నవంబర్ 03, ప్రజాపాలన ప్రతినిధి: మండలంలోని గోపవరం, వేల్పుచర్ల గ్రామాలను శుక్రువారం నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్ర ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారు. ప్రతి గ్రామంలో సచివాలయాలు, వెల్ నేస్ సెంటర్లు, ఆర్బీకేలకు స్థలాలు కేటాయించి, భవనాల నిర్మాణాలకు ప్రాధాన్యత ఇస్తూ నిర్మాణాలు చేపట్టారు. దీనిలో భాగంగా గోపవరం, వేల్పుచర్ల గ్రామాలలోని సచివాలయాలు, వెల్ నేస్ సెంటర్లు, ఆర్బీకే లను సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్ర సందర్శించి, నిర్మాణాలను పరిశీలించారు. సచివాలయాలు, వెల్ నేస్ సెంటర్లు, ఆర్బీకేల నిర్మాణాలను జాప్యం చేయకుండా త్వరితగతిన పూర్తి చేయాలని నిర్మాణ కాంట్రాక్టర్లను, అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ జి రాణి, పంచాయితీరాజ్ ఏఈ ప్రసాద్, విఆర్ఓ పి.సురేష్, సిబ్బంది, తదితరుల పాల్గొన్నారు.

## పారిశ్రామిక అభివృద్ధి కోరుతూ సిపిఎం పాదయాత్ర




చీరాల, నవంబర్ 03, ప్రజాపాలన : పట్టణంలో రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం తదితర మౌలిక వసతులను మెరుగు పర్చాలని, సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య కోరారు. చీరాల ప్రాంతంలో ఉపాధి అవకాశాలు పెంచేవిధంగా, పారిశ్రామిక అభివృద్ధి చేయాలని డిమాండ్ చే శారు. స్వర్ణగేటు సెంటర్ నుండి, సిపిఎం పట్టణపాదయాత్రలను, ఆయన జెండాఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, కేంద్రం లో అధికారంలో ఉన్న బిజెపి ప్రకృతివనరులను, దేశప్రజల ఆస్థులైన ప్రభుత్వ సంస్థలను, అంబానీ, అదానీలకు అమ్మేయడమే పనిగా పెట్టు కుని, పనిచేస్తుందని ఆరోపించారు. బిజెపి ప్రజా ద్రోహ విధానాలను, రాష్ట్రంలోని వైసిపి, టిడిపి రెండూ సమర్థిస్తూ, రాష్ట్ర ప్రజలకు తీరని ద్రోహం చేస్తున్నాయని ఆరోపించారు. అధికారంలో ఉన్న వైసిపి దళితులకు తీరని అన్యాయం చేస్తూ, సామాజిక సాధికారత పేరుతో యాత్రలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రతిపక్షంలోఉన్న టిడిపి కూడా, మళ్లీ అధికారం కోసమే యాత్రలు చేస్తుంది తప్ప, ప్రజల సమస్యలను చర్చకు తేవడంలేదన్నారు. సిపిఎం ప్రజా సమస్యలే అజెండాగా, రాష్ట్ర వ్యాప్తంగా బస్సు యాత్రలు చేస్తుందన్నారు. ఈనెల 8న బస్సు యాత్ర చీరాల పట్టణానికి వస్తుందని తెలిపారు. ఈనెల 15న విజయ వాడలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వాన్ పిక్ భూముల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని,అలా సాధ్యంకాకపోతే, రైతులకు ఆ భూములు తిరిగిఇవ్వాలని డిమాండ్ చేశారు. వరి, ఇతర పంటలు సాగు చేసిన రైతులకు, తక్షణం సాగునీళ్లు ఇచ్చి, పంటలను కాపాడాలని కోరారు. ప్రభుత్వ అనాలోచిత విధానాలవల్లనే, పంటలు ఎండిపోయే పరి స్థితులు వచ్చాయన్నారు. ముందుచూపుతో సాగునీటి వనరులను సంరక్షించి ఉంటే, ఇప్పుడు ఇలాంటి కరువు పరిస్థితులు వచ్చేవి కావన్నారు. ఇప్పటికైనా బాపట్ల జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి, పంటలు నష్టపోయిన రైతులకు, పంటల భీమా ద్వారా నష్టపరిహారం చెల్లించేందుకు, ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. పాదయాత్రలో సిపిఎం కార్యదర్శి ఎన్. బాబూరావు, నాయకులు ఎం.వసంతరావు, పి కొండయ్య, రాజాలు, డి. నారపరెడ్డి, ఎల్.జయరాజు, ఆదిశంకరయ్య, గోసాల సుధాకర్, సత్యమూర్తి, జి ప్రతాప్, ఐవి ప్రసాదరావు, ఎం.అయ్యప్ప రెడ్డి, సత్తెవేలు, ప్రసాదరెడ్డి, రాఘవులు, డేవిడ్, భగవాన్ దాస్, ఎలానాటి కిషోర్, ఎన్ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## తప్పుడు కేసుల పై న్యాయపోరాటం చేస్తాం

**నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్-ఛార్జ్ డా.చదలవాడ అరవింద బాబు.**



పల్నాడు జిల్లా. నరసరావుపేట. నవంబర్ 3 (ప్రజాపాలన ప్రతినిధి.): నరసరావుపేట నియోజకవర్గంలోని పోలీసులు వైసీపీ కార్యకర్తల్లా వ్యవహరిస్తూ టీడీపీ నేతల పై తప్పుడు కేసులు పెడుతున్నారంటూ పల్నాడు జిల్లా కలెక్టర్,ఎస్పీకి నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్-ఛార్జ్ డా.చదలవాడ అరవింద బాబు ఫిర్యాదు చేశారు.తెలుగుదేశం పార్టీ కోసం పని చేసే కార్యకర్తలను బెదిరిస్తూ అత్యంత దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని,వారి పై చర్యలు తీసుకోకుంటే ప్రైవేటు కేసులు వేసి న్యాయపోరాటం చేస్తామన్నారు.వైసీపీ కనుసన్నల్లో రొంపిచర్ల మండల ఎస్ఐ,రూరల్ సిఐ,ఎస్.ఐ,పట్టణంలోని సీఐలు,ఎస్ఐలు పని చేస్తున్నారన్నారు.తెలుగుదేశం పార్టీలో తిరిగినా,పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్నా కేసులు పెడతామని బెదిరిస్తున్నారన్నారు.నియోజకవర్గంలో శాంతియుత వాతావరణాన్ని అధికార పార్టీ నేతలతో కలిసి పోలీసులు దెబ్బతీయడం అత్యంత దుర్మార్గమని డా.చదలవాడ అరవింద బాబు పేర్కొన్నారు.ఇప్పటికైనా కలెక్టర్,ఎస్పీ దృష్టి సారించి చర్యలు తీసుకోకుంటే న్యాయ పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొంటూ డా.చదలవాడ కలెక్టర్,ఎస్పీకి మెమొరాండం అందించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పులిమి రామిరెడ్డి,కొల్లి వెంకటేశ్వర్లు,కొల్లి బ్రహ్మయ్య,చింతిరాల బాలు,చల్లగుండ్ల హరికృష్ణ,సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

## పశువుల కన్నా,మృగాల కన్నా హీనంగా ప్రవర్తించారు

### వైసిపి రౌడీ మూకలుమాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



కంచికచర్ల నవంబర్ 3 ప్రజా పాలన ప్రతినిధి:స్థానిక అంబేద్కర్ కాలనీకి చెందిన కాండ్రు శ్యాంకుమార్ పై గుంటూరుకు చెందిన హరీష్ రెడ్డి మరియు వారి అ నుచరులు చేసిన దానిని ఖండిస్తూ శ్యాం కుమార్ ను నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు మా జీ శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య పరామర్శి స్తున్న సమయంలో శ్యాం కుమార్ స్పృహ కోల్పోవ డంతో హుటాహుటిన కంచికచర్ల టౌన్ కృష్ణమోహన్ హాస్పిటల్ కు తరలించి వైద్య సేవల ఏర్పాట్లను దగ్గ రుండి పర్యవేక్షించిన తంగిరాల సౌమ్య అనంతరం శ్యామ్ కుమార్ కు న్యాయం చేయాలంటూ చెవిటి కల్లు సెంటర్ అంబేద్కర్ విగ్రహం వద్ద బిఎస్పీ మరి యు అమరావతి పరిరక్షణ దళిత జేఏసీ నేతలతో కలిసి ధర్నాలో పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూశ్యామ్ కు సంబంధం లేని వివాదంలోకి గుంటూరు కు చెందిన ఒకే సామాజిక (రెడ్డి) వర్గ ఆ రుగురు యువకులు ప్రధాన నిందితుడు హరీష్ రెడ్డి కారులో అతి దారుణంగా ఎక్కించుకొని గుంటూరు వరకు తీసుకొని వెళుతూ దారి మధ్యలో చిత్రహింస లకు గురి చేశారన్నారువారి దెబ్బలకు తాళం లేక శ్యామ్ మంచినీరు అడిగితే ఆరుగురు రౌడీ మూకలు అతనిపై మూత్రం పోశారన్నారునిందితులను తప్పిం చడానికి పోలీసులు శతవిధాలా ప్రయత్నిస్తున్నార న్నారునిందితులను తక్షణమే అరెస్టు చేయాలి వా రిపై కిడ్నాప్, హత్యాయత్నం,ఎస్సీ ఎస్టీ కేసులను న మోదు చేయాలని శ్యాం కుమార్ కు వెంటనే మెరుగైన వైద్యం అందించేలాగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీ సుకోవాలని డిమాండ్ చేశారు.

## మొక్కులు తీర్చుకున్న తెదేపా నేతలు




నరసాపురం, నవంబర్ 3 (ప్రజాపాలన ప్రతినిధి) : తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మధ్యంతర బెయిలుపై జైలు నుంచి విడుదలైన సందర్భంగా ఆయన కోలుకొని సంపూర్ణ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ శుక్రవారం స్థానిక నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుండి నరసాపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాదయాత్రగా బయలుదేరి అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి చేరుకొని శ్రీ లక్ష్మీ నరసింహస్వామికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా పొత్తూరి రామరాజు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం చంద్రబాబు నాయుడుపై అక్రమ కేసులు బనాయించి జైల్లో ఉంచిన కారణంగా ఆయన అనారోగ్యం పాలయ్యారని హైకోర్టు మధ్యంతర బెయిలు మంజూరు చేయడంతో చంద్రబాబు జైలు నుంచి విడుదలైన సందర్భంగా పాదయాత్రగా బయలుదేరి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నామని తెలిపారు. చంద్రబాబు త్వరితగతిన అనారోగ్యం నుండి కోలుకొని సంపూర్ణ ఆయురారోగ్యాలతో ఉండాలని, రానున్న 2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఘన విజయం సాధించి చంద్రబాబు నాయుడు తిరిగి ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు వాతాడి ఉమా మహేశ్వరరావు, గుబ్బల నాగరాజు, కొప్పాడ రవీంద్రనాథ్ ఠాగూర్, జోగి పండు, సంకు భాస్కర నాయుడు, బర్రె మురళి, సంధి నరసింహారావు, తిరుమాని శశిదేవి, కొలచన శ్రీ పద్మ, తదితరులు పాల్గొన్నారు.

## జగన్ పాలనలో శరవేగంగా రాష్ట్రం అభివృద్ధి



ఆగిరిపల్లి, నవంబర్ 03, ప్రజాపాలన ప్రతినిధి: జగన్ పాలనలో శరవేగంగా రాష్ట్రం అభివృద్ధి సాధిస్తోందని నూతివీడు శాసనసభ్యులు మేక వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. నూజివీడు నియోజకవర్గ పరిధిలోని ఆగిరిపల్లి మండలం ఈదర గ్రామంలో శుక్రవారం 16.7 లక్షల రూపాయలతో నిర్మించిన సిమెంటు రోడ్లు, 21.8 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతాప్ మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ, నగర ప్రాంతాలలో అన్ని రంగాలు శరవేగంగా అభివృద్ధి సాధించే దిశగా జగన్ పాలన కొనసాగిస్తున్నట్లు చెప్పారు. గ్రామాలకు పూర్వవైభవం తెచ్చే దిశగా సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్స్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఎన్ని ఉపద్రవాలు సంభవించినా అభివృద్ధి, సంక్షేమం విడవకుండా అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్ కే దక్కిందన్నారు. రాష్ట్రంలో వినూత్న రీతిలో అమలు జరుగుతున్న సచివాలయ వ్యవస్థ, వాలంటీర్ వ్యవస్థల పట్ల దేశంలోని అన్ని రాష్ట్రాలు పరిశీలన కొనసాగించి అమలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ప్రపంచ దేశాలకు ఆదర్శనీయంగా డైనమిక్ సీఎం జగన్మోహన్ రెడ్డి పరిపాలన కొనసాగిస్తున్నారని వివరించారు. నూజివీడు పట్టణంలో అత్యాధునిక వసతి సౌకర్యాలతో నిర్మించిన ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని రకాల విభాగాలకు చెందిన వైద్యులు అందుబాటులో ఉన్నారని, ఈ మేరకు చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ఇకపై మెరుగైన వైద్య సేవలకు విజయవాడ వంటి నగరాలకు తరలి వెళ్ళవలసిన అవసరం లేదన్నారు. నూజివీడులోని అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, డయాలసిస్, బ్లడ్ బ్యాంక్, విశాలమైన ఆపరేషన్ థియేటర్లు, రోగులకు అవసరమైన ప్రత్యేక గదులు నిర్మించినట్లు చెప్పారు. త్వరలోనే నిర్మాణ పనులు పూర్తిచేసుకుని ప్రజలకు ఆసుపత్రి సేవలు అందుబాటులోకి తేనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గోళ్ళ అనూష, వైస్ ఎంపిపి గెద్దం సాంబశివరావు, జెడ్పిటిసి పిన్నిబోయిన వీరబాబు, ఏలూరు జిల్లా ఎస్సి సెల్ అధ్యక్షులు తులిమెల్లి జ్యోతి సుజాత, ఎంపిటిసి దొండపాటి కుమారి, వైసిపీ నాయకులు ధనపనేని వేణు, సత్యమబాబు, గోళ్ళ ఇస్సాకు, మండల పార్టీ అధ్యక్షులు పలగాని నరసింహరావు, మొగదాటి జోజిబాబు, నీలం రవీంద్ర, గోరుముచ్చు కాసులు, సర్పంచులు, సచివాలయ, ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య



జగ్గయ్యపేట నవంబర్ 3 ప్రజాపాలన ప్రతినిధి బాబు శివ రెడ్డి భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా పట్టణంలో సీతారామపురంలో మాజీ ఎమ్మెల్యే శ్రీరా మ్ రాజగోపాల్ తాతయ్య పర్యటించారు తెలుగు దేశం పార్టీ అధి కారంలోకి వస్తే లబ్ధిదారులకు చేకూరే ప్రయోజనాల ను ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు వి వరించి కరప త్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మేక వెంకటే శ్వ ర్లు, పట్టణ తెలుగుదేశం పార్టీ సెక్రెటరీ మైనేని రాధాకృ ష్ణ, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గింజుపల్లి రమేష్, నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు %డ% కౌ న్సిలర్ కన్నెబోయిన రామలక్ష్మి, కాకన బోయిన కనక దుర్గ, పేరం కృష్ణవేణి, కాకనబోయిన ధనలక్ష్మి తదిత రులు పాల్గొన్నారు.

## స్వర్ణాంధ్ర విద్యార్థులకు కొలువుల జాతర



నరసాపురం, నవంబర్ 3 (ప్రజాపాలన ప్రతినిధి) :అవకాశాలు నిరంతరం ఉంటాయని వాటి వెన్నంటే అవరోధాలు కూడా ఉంటాయని అవరోధాలను అధిగమించి అవకాశాలను అందిపుచ్చుకుని శ్రద్ధాసక్తులతో పనిచేసిన వారు మాత్రమే విజేతలుగా నిలుస్తారని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలల చైర్మన్ కె.వి సత్యనారాయణ(కె.ఎస్) అన్నారు. నరసాపురం మండలం సీతారాంపురం స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఏఐఎంఎల్, సిఎస్ఈ, ఈసీఇ, ట్రిపుల్ఈ, ఐటీ, ఎంసీఏ విభాగాలకు చెందిన 187 మంది విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూలలో ప్రముఖ ఐటీ కంపెనీలైన ఆర్మ్, కాన్సెంట్ గ్లోబల్ సొల్యూషన్స్, ఈన్ఫ్రాటెక్, వన్ ఎస్ సొల్యూషన్స్, ఆర్గ వేర్ టెక్నాలజీస్, టెఫోలాజిక్, వెమ్ టెక్నాలజీస్, విబ్స్ ఇన్ఫోసోల్, వైష్ణవి ఇన్ఫోటెక్ కంపెనీలలో అత్యధిక వేతనంగా సంవత్సరానికి 12 లక్షల రూపాయలు, అత్యల్పంగా మూడున్నర లక్షల ప్యాకేజీతో కొలువుల సాధించారు. ఈ సందర్భంగా శుక్రవారం స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కొలువులు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా పలువురు కళాశాల పాలకవర్గ సభ్యులు, విభాగాధిపతులు మాట్లాడుతూ ప్రముఖ యూనివర్సిటీలైన కేఎల్ యూనివర్సిటీ, గీతం యూనివర్సిటీ విద్యార్థులతో పోటీపడి తమ కళాశాల విద్యార్థులు 157 మంది అత్యధిక వేతనంతో ఉద్యోగాలు సాధించడం కళాశాలకు గర్వకారణమని అన్నారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు శ్రద్ధాసక్తులతో పనిచేసి మరింత ఉన్నతి సాధించాలని తద్వారా తమ తల్లి దండ్రులకు ఆర్థికంగా ఆసరాగా నిలవాలని కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ టెక్నాలజీ కళాశాల చైర్మన్ కెవి సత్యనారాయణ, ట్రెజరర్ కె.వి స్వామి, పాలకవర్గ సభ్యులు అడ్డాల శ్రీహరి, టి.వి.వి ప్రసాద్, పి. వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాళ్లు డాక్టర్ ఎస్. సురేష్ కుమార్, డాక్టర్ పి. పండరీనాథ్, ప్లేస్మెంట్ ఆఫీసర్లు బి మురళి, అమృత్, పలు విభాగాల అధిపతులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతల పరిరక్షణకు నిష్పక్షపాతంగా కృషి చేస్తా

**చీరాల వన్ టౌన్ నూతన సిఐ శేషగిరిరావు**
**చీరాల వన్ టౌన్ నూతన సీఐ గా బాధ్యతలు స్వీకరించిన శేషగిరిరావు**
**తాడేపల్లి నుండి చీరాలకు బదిలీ పై వచ్చిన సీఐ**
**నేరాల నియంత్రణలో ఆయనకు ఆయనే సాటి**
**పవర్ ఫుల్ సీఐ గా మంచి పేరు ఉన్న శేషగిరిరావు**



చీరాల, నవంబర్ 03, ప్రజాపాలన : శాంతి భద్రతల పరి రక్షణకు, నిష్పక్ష పాతంగా కృషిచేస్తానని, చీరాల వన్ టౌన్ పోలీస్ స్టేషన్ నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్ గా, బాధ్యతలు స్వీకరించిన శేషగిరిరావు స్పష్టం చేశారు. గతంలో సీఐగా పనిచేసిన మల్లిఖార్జునరావు మంగళగిరికి బదిలీపై వెళ్ళగా, అప్పటినుండి ఖాళీగా ఉన్న సీఐ స్థానంలో, తాడేపల్లి నుండి బదిలీపై శేషగిరిరావు చీరాల వచ్చారు. రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా, నీతి,నిజాయితీగా పనిచేస్తారని, నేరాల నియంత్రణలో, ఆయనకు ఆయనే సాటి అని, తాడేపల్లి, గతంలో సిఐగా పనిచేసిన ప్రాంతాలలో పవర్ ఫుల్ సి.ఐ.మంచి పేరు ఉన్న శేషగిరిరావు, చీరాల వన్ టౌన్ సీఐగా బాధ్యతలు స్వీకరించడం పట్ల, పలు రంగాల ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు. చీరాలలో నేరాల నియంత్రణకు, ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి, తగిన చర్యలు తీసుకోగలుగుతారన్న ఆశాభావాన్ని చేశారు. బాధ్యత లు స్వీకరించిన శేషగిరిరావు కు, వన్ టౌన్ పోలీస్ అధికారులు, సిబ్బంది తొలుత ఘన స్వాగతం పలికి, శుభాకాంక్షలు తెలియజేశారు.

## చిత్తూరు వైసీపీలో విభేధాలు

తిరుపతి, నవంబర్ 3, :చిత్తూరు వైసీపీ నేతల్లో కొన్ని రోజులుగా వర్గ విభేదాలు, వైషమ్యాలు తలెత్తుతున్నాయి. ఈ విభేదాలు తాజాగా కూడా బయటపడ్డాయి. చిత్తూరులో వైసీపీ చేపట్టిన సామాజిక సాధికారిక యాత్రలో నాయకుల మధ్య సమన్వయ లోపం కొట్టొచ్చినట్లు కనిపించింది. జిల్లా పెద్దగా పేరుందిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎక్కడా ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం అందర్నీ ఆశ్చర్యానికి గురి చేసింది. నేతల మధ్య సఖ్యత కుదరకపోవడం వల్లే మంత్రి పెద్దిరెడ్డి ఎక్కడ మాట్లాడలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మంత్రి మాట ఓ నేత పెడచెవిన పెట్టినట్లు సమాచారం. దీనికి తోడు రెండు రోజులుగా చిత్తూరులో బస్సు యాత్రకు సంబంధించి స్థానిక ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు, ఇతర నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బ్యానర్ల స్థలాల విషయంలో సైతం వర్గ విభేదాలు, మనస్పర్ధలు వచ్చినట్లు తెలిసింది. తొలుత చిత్తూరు గాంధీ విగ్రహం వద్ద బహిరంగ సభ ఏర్పాటు చేయాలని నిర్ణయించినప్పటికీ కొందరి నేతలకు చెప్పకుండా పలమనేరు రోడ్డులో ఏర్పాటు చేయడంపై సైతం నేతల మధ్య సఖ్యత లేదనిపిస్తోంది. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న సాధికార సామాజిక బస్సుయాత్ర కార్యక్రమం చిత్తూరు నేతల మధ్య సమన్వయం లేకపోవడంతో విజయవంతం కాలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనికి తోడు సాక్షాత్తు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్ర రెడ్డి యాత్ర ప్రారంభమైనప్పటి నుంచి సభా వేదిక వద్ద వరకు ఎక్కడ ఒక మాట కూడా మాట్లాడక పోవడంపై పార్టీ నేతలు కార్యకర్తలు తీవ్ర అసంతృప్తి వ్యక్తపరుస్తున్నారు. కేవలం నేతల మధ్య వర్గ విభేదాల వల్లే మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడకుండా వెళ్లిపోయారని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా మంత్రి రోజా చివర్లో వచ్చి అప్పుడే వెళ్లిపోవడంతో పాటు పూతలపట్టు ఎమ్మెల్యే ఎమ్మెస్ బాబు మధ్యలోనే వెళ్లిపోయారు. ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి సైతం ఎంఎస్ఆర్ సర్కిల్ దగ్గర జరుగుతున్న బహిరంగ సభ నుంచి అనుచరులతో అలిగి వెళ్లిపోవడం చర్చనీయాంగా మారింది.

# శ్రీకాకుళంలో పులి.. టెన్షన్..!

శ్రీకాకుళం, నవంబర్ 3, :భయం.. ఈ ఎమోషన్ తో చాలామంది ఆడుకుంటుంటారు. ముఖ్యంగా పల్లెల్లో ఏదైనా అనుకోని, ప్రమాదకర ఘటన జరిగినప్పుడు దానిపై పుకార్లు షికార్లు చేస్తుంటాయి. తాజాగా, శ్రీకాకుళం జిల్లాలో పలాస, మందస, సోంపేట, కంచిలి, కవిటి, ఇచ్ఛాపురం మండలాల్లో పులి సంచారం విషయంలోనూ ఇదే జరుగుతోంది. ఏ చిన్న ఘటనా జరిగినా దీనికే ముడిపెడుతూ కొందరు సోషల్ మీడియాలో ఫేక్ సమాచారంతో అతి చేస్తున్నారు. అదుగో పులి అంటే ఇదిగో తోక అన్న చందంగా ప్రవర్తిస్తున్నారు. దీంతో స్థానిక ప్రజలు మరింత భయాందోళనకు గురవుతున్నారు. ఈ క్రమంలో ఫేక్ వార్తలు ప్రచారం చెయ్యకుండా పోలీసులు కట్టడి చేయాలని కోరుతున్నారు. శ్రీకాకుళం జిల్లాలో పలు మండలాల్లో పెద్ద పులి సంచారంతో ప్రజలు వణికిపోతున్నారు. గత వారం రోజులుగా పలాస, మందస, సోంపేట, కంచిలి, కవిటి, ఇచ్ఛాపురం మండలాల్లో పులి సంచరిస్తోంది. మంగళవారం రాత్రి కవిటి, కంచిలి మండలాల్లోని పలు గ్రామాల్లో ఆవులు, గేదెలపై దాడి చేసింది. కంచిలి మండలం మండపల్లిలో మాదిన హరిబాబుకు చెందిన ఆవుపై దాడి చేసి పొదల్లోకి లాక్కెళ్లింది. తీవ్రంగా గాయపడిన ఆవు మృతి చెందింది. ఉదయం తోటకు వెళ్లిన రైతు.. మృతి చెందిన ఆవును గుర్తించి అటవీ అధికారులకు సమాచారం అందించారు. సహలాలపుట్టుగలో ఆవు, కొండిపుట్టుగలో గేదె దూడపై పులి దాడి చేయడంతో అవి మృతి చెందాయి. గుజ్జుపుట్టుగ గ్రామంలో ఆవు దూడకు తీవ్ర గాయాలయ్యాయి. అటవీ శాఖ అధికారులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. ఇచ్ఛాపురం మండలం తిప్పనపుట్టుగ, ఈదుపురం, కొఠారీ, ధర్మపురం, రాజపురం పరిసర ప్రాంతాల్లో సంచరించింది. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎ.మురళీకృష్ణంనాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది ఆయా గ్రామాల్లో పెద్దపులి పాదముద్రలను గుర్తించారు. ఈ క్రమంలో అప్రమత్తంగా ఉండాలని ఆయా ప్రాంతాల వారిని అలర్ట్ చేశారు. అయితే, పులి సంచారంపై సోషల్ మీడియాలో వదంతులు సైతం అంతే వేగంగా షికారు చేస్తున్నాయి. తమ ప్రాంతంలో పులిని చూశామని కొందరు, తమ ప్రాంతంలో పులి పశువులపై దాడి చేసి చంపిందని ఇంకొందరు సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేస్తున్నారు. కాగా, కొన్నింటిపై ఎలాంటి అధికారిక సమాచారం ఉండడం లేదు. ఇలాంటి పుకార్లతో ఆయా ప్రాంతాల ప్రజలు మరింత ఆందోళనకు గురవుతున్నారు. సోషల్ మీడియాలో ఇలాంటి ఫేక్ వార్తలు ప్రచారం కాకుండా పోలీసులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. సోంపేట మండల పరిధిలోని మండపల్లి, చీకటి సోంపేట పరిసర ప్రాంతాల్లో పెద్ద పులి సంచారం ఉందని, ఇక్కడి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ అధికారులు సూచించారు. సాయంత్రం 5 తర్వాత ఉదయం 6 గంటల లోపు ఎవ్వరూ ఒంటరిగా తిరగొద్దని హెచ్చరించారు. అత్యవసర పరిస్థితిలో మాత్రమే బయటకు రావాలని సూచించారు. రాత్రి సమయంలో పశువులను నివాస ప్రాంతాలకు దూరంగా విడిచిపెట్టొద్దని పోలీసులు సూచించారు. పెద్దపులిని పట్టుకోవడానికి అటవీ శాఖా, పోలీసులు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అప్పటి వరకు సోంపేట మండల ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. పెద్దపులి సంచారం గురించి తెలిస్తే కంట్రోల్ రూమ్ ఫోన్ నెం. 94924 19724, 85010 08880కు సమాచారం ఇవ్వాలని కోరారుగత కొన్ని రోజుల నుంచి ఆంధ్రా, ఒడిశా సరిహద్దులో పులి సంచారం ఉందని, అక్టోబర్ 25న తొలిసారి పులి సంచారం గుర్తించినట్లు అటవీ శాఖ అధికారులు వెల్లడించారు. అప్పటి నుంచి పులి జాడ కనుక్కొనేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. పులి సంచారంపై ఆందోళన వద్దని, ఏవైనా అనుమానాస్పద గుర్తులు కనిపిస్తే అధికారులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. ఏమైనా పెంపుడు జంతువులపై పులి దాడి చేసి చంపేస్తే ప్రభుత్వం చట్ట ప్రకారం నష్టపరిహారం చెల్లిస్తుందన్నారు.

## ఏపీలో మరో కొత్త పార్టీ

విజయవాడ, నవంబర్ 3, :ఏపీలో ఎన్నికలు సమీపిస్తున్న వేళ కొత్త పార్టీ ప్రారంభమైంది. ఏపీ పెన్షనర్స్ పార్టీ పేరుతో కొత్త పార్టీ ఏర్పాట్లు చేస్తున్నట్లు పి.సుబ్బరాయన్ ప్రకటించారు. ఈ మేరకు ఆంధ్ర పెన్షనర్స్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పి.సుబ్బారాయన్ మాట్లాడారు. ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులకు ఒక రాజకీయ వేదిక ఉండాలనే ఆలోచనతో పెన్షనర్స్ పార్టీని స్థాపించడం జరిగిందని వెల్లడించారు. వైసీపీ ప్రభుత్వం పెన్షనర్ల పట్ల నిర్లక్ష్య వైఖరితో వ్యవహరిస్తోందని..పెన్షనర్ల ప్రయోజనాలను ప్రభుత్వం కాల రాస్తోందని ధ్వజమెత్తారు. పెన్షనర్స్ మెడికల్ బిల్లులు, సకాలంలో పెన్షన్‌లు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతోందని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వ విధానాలపట్ల విరక్తితో తాను ఏపీ పెన్షనర్స్ పార్టీని స్థాపించినట్లు తెలిపారు. ఈ ప్రభుత్వం ఉద్యోగులను పట్టించుకోవడం లేదు.. పెన్షనర్లపట్ల నిర్లక్ష్యం, రైతులంటే చులకన భావం చూపిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మేధావుల తమ పార్టీలోకి రావాలని ఏపీ పెన్షనర్స్ పార్టీ అధ్యక్షుడు పి.సుబ్బరాయన్ ఆహ్వానించారు. ఇకపోతే ప్రతీ ఏడాది జనవరి నెలలో జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని చెప్పిన వైఎస్ జగన్ తీరా అధికారంలోకి వచ్చాక ఖాళీ పోస్టులను కూడా భర్తీ చేయడం లేదని ఏపీ పెన్షనర్స్ పార్టీ అధ్యక్షుడు పి.సుబ్బరాయన్ విమర్శించారు. అంతేకాదు టీచర్‌లను సారా దుకాణాల్లో పని చేసే వారిలా మార్చిందని...రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడటంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని మండిపడ్డారు. రాష్ట్రంలో నెలకొన్న సమస్యలను చెప్పుకోవడానికి కూడా హోం మంత్రి అందుబాటులో ఉండటం లేదని ఏపీ పెన్షనర్స్ పార్టీ అధ్యక్షుడు పి.సుబ్బరాయన్ వెల్లడించారు. ఇదిలా ఉంటే ఐఆర్ పేరిట పెన్షనర్స్ జీతాల్లో కోత పెట్టింది అని చెప్పుకొచ్చారు. రిటైర్ అయిన వాళ్లకు క్వాంటమ్ పెన్షన్‌లో కోత పెట్టడం ఏంటని మండిపడ్డారు. వైఎస్ జగన్ మాటలు నమ్మే స్థితిలో ఉద్యోగులు, పెన్షనర్లు లేరని..రాబోయే ఎన్నికల్లో తమ సత్తా ఏంటో చూపిస్తామని హెచ్చరించారు. ఇకపోతే త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా పెన్షనర్ల సదస్సు నిర్వహిస్తామని...అదే వేదికపై భవిష్యత్ కార్యచరణ ప్రకటిస్తామని ఏపీ పెన్షనర్స్ పార్టీ అధ్యక్షుడు పి.సుబ్బరాయన్ తెలిపారు.

## ఫైబర్ గ్రిడ్ కేసులో నేతల ఆస్తుల అటాచ్ మెంట్

విజయవాడ, నవంబర్ 3, : ఫైబర్ గ్రిడ్ కేసులో కీలక పరిణామం చోటు చేసకుంది. ఫైబర్ నెట్ ప్రాజెక్టు మొదటి దశలో అక్రమాలు జరిగాయనే ఆరోపణల నేపథ్యంలో నిందితుల ఆస్తులను అటాచ్ చేస్తూ ఏపీ హోంశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జీవో 180ను హోంశాఖ కార్యదర్శి హరీష్ గుప్తా జారీ చేశారు. సిఐడి ఏడీజీ నేతృత్వంలో జరిగిన దర్యాప్తులో కుట్రకు సంబంధించిన వాస్తవాలు వెలుగు చూశాయని, నేరపూరిత చర్యల వల్ల ప్రభుత్వానికి రూ.114కోట్ల రుపాయల నష్టం వాటిల్లేలా చేశారని సిఐడి గుర్తించింది. ఏపీఎస్ఎఫ్ఎల్ ఎండి మధుసూదన్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ఫైబర్ నెట్ కేసులో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఏ25 గా ఉన్నారు. చంద్రబాబు



సహకారంతో ఏ1గా ఉన్న వేమూరి హరికృష్ణ ప్రసాద్, ఏ11గా ఉన్న టెరా సాఫ్ట్‌వేర్ లిమిటెడ్ సంస్థ డైరెక్టర్ తుమ్మల గోపీచంద్ కుట్రకు పాల్పడ్డారని పేర్కొన్నారు. నకిలీ ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్స్‌తో పనులు దక్కించుకున్నారని సిఐడి దర్యాప్తులో వెల్లడైంది. ప్రభుత్వ ప్రాజెక్టును దక్కించుకునేందుకు అక్రమాలకు పాల్పడినట్లు వెల్లడైంది. విప్లవ్‌కుమార్, విజయ్‌కుమార్ రామ్మూర్తి, కనుమూరి వెంకటేశ్వర రావు వంటి వారికి చెందిన సంస్థలు కుట్రలో పాల్గొన్నాయని తెలిపారు. నాసిరకం పరికరాలతో ప్రభుత్వాన్ని మోసం చేశారని టెరాసాఫ్ట్‌కు నిధుల విడుదల ద్వారా ప్రభుత్వ ఖజానాకు రూ.114కోట్ల నష్టం వాటిల్లినట్టు పేర్కొన్నారు. సిఐడి దర్యాప్తు ఆధారంగా కుట్రలో పాల్గొన్న పలు సంస్థలకు చెందిన స్థిరాస్తుల అటాచ్‌మెంట్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వీటిలో ఏడు స్థిరాస్తులను అటాచ్ చేయాలని సిఐడి అధికారులు ప్రతిపాదించారు. సీఐడీ ప్రతిపాదనకు హోంశాఖ ఆమోదం తెలుపుతూ జీవో విడుదల చేసింది. ఫైబర్ నెట్ స్కాంలో నిందితులైన టెర్రా సాఫ్ట్ ఎండీ తుమ్మల గోపీచంద్ కి ఆస్తులతోపాటు పలు కంపెనీల ఆస్తులు అటాచ్ చేయాలని సిఐడి హోంశాఖను కోరింది. తుమ్మల గోపీచంద్, ఆయన భార్య పావని పేర్లపై హైదరాబాద్ శ్రీనగర్ కాలనీ, యూసుఫ్ గూడ, జూబ్లీహిల్స్ కాలనీ, చిన్న మంగళారంలో ఇల్లు, వ్యవసాయ క్షేత్రాలు అటాచ్ చేశారు. ఇదే కేసులో నిందితులైన నెటాప్స్ ఫైబర్ సొల్యూషన్స్ డైరక్టర్ కనుమూరి కోటేశ్వరరావుకి చెందిన గుంటూరు, విశాఖ కిర్లంపూడి లే అవుట్ లోని ఇళ్లు అటాచ్ చేశారు. గుంటూరులో ఇంటి స్థలం, విశాఖపట్నంలో ఓ ఫ్లాట్, హైదరాబాద్ లోని 4 ఫ్లాట్లు, రంగారెడ్డి జిల్లాలో వ్యవసాయ భూమిని హోంశాఖ అటాచ్ చేసింది. స్థిరాస్తుల అటాచ్‌మెంట్ కు అనుమతించాలని కోరుతూ విజయవాడ ఏసీబీ న్యాయస్థానంలో సీఐడీ పిటిషన్ దాఖలు చేయనుంది.

## కడప జిల్లాల్లో తీవ్ర కరువు ఛాయలు

కడప, నవంబర్ 3, :ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సొంత జిల్లాలో తీవ్ర కరువు ఛాయలు అలుముకున్నాయి. గత ఐదారు ఏళ్ళలో ఎన్నడూ లేనంతగా ఈ ఏడాది కనిపిస్తున్నాయి. వర్షాభావం, ప్రాజెక్టులకు చాలినంత నీటి సరఫరా లేక సాగు భూములన్నీ బీడుగా మారిపోయాయి. అయినా అంతా బాగానే ఉందని అధికారులు మభ్యపెట్టే ప్రయత్నం చేస్తూనే,17 మండలాల్లో దుర్భిక్ష పరిస్థితులు ఉన్నాయని ప్రభుత్వానికి నివేదికలు పంపడం గమనార్హం. జిల్లాపై నైరుతి రుతు పవనాలు కరుణించక పోయినా, సెప్టెంబర్, అక్టోబర్ మాసాల్లో ఈశాన్య ఋతుపవనాల ప్రభావంతో వర్షాలు బాగా కురిసేవి. ఈ సారి వాన జాడే లేకుండా పోయింది. తీవ్ర వర్షాభావం, మరోవైపు శ్రీశైలం నీరు రాకపోవడంతో, జిల్లాలోని 95 వేల ఎకరాల ఆయకట్టు కలిగిన ప్రధాన సాగు నీటి వనరు అయిన కేసీ కెనాల్‌కు చుక్క నీరు లేకుండాపోయింది. మైదుకూరు, బద్వేలు నియోజకవర్గాలకు బ్రహ్మ సాగర్ నుంచి కూడా నీరు వదలకపోవడంతో, చెరువులు, చిన్నచిన్న ప్రాజెక్టులు ఎండిపోయాయి. ఇదే కాకుండా గండికోట రిజర్వాయర్, దాన్ని ఎత్తిపోతల పథకాలు, సర్వాయి సాగర్, వామికొండ ప్రాజెక్టుల కింద కూడా ఖరీఫ్ సాగు తగ్గింది. ఈ ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా బీడు భూములు దర్శనమిస్తున్నాయి. జిల్లాలో మొత్తం 36 మండలాలు ఉండగా, 17 మండలాల్లో కరువు ఉందని అధికారులు తేల్చారు. ప్రభుత్వానికి నివేదిక పంపారు. అయినా, స్పందన లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అసలు సీఎం సొంత జిల్లాలో కరువు లేదన్నట్లుగా చూపించే ప్రయత్నం చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 103 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించిన ప్రభుత్వం కడప తో పాటు విభజిత అన్నమయ్య జిల్లా పైన కూడా కరుణ చూపలేదు. ఈ జిల్లాలోని 30 మండలాల్లో 23 మండలాల్లో కరువు ఛాయలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం 18 మండలాల్లో కరువు నెలకొందని అధికారులు ప్రతిపాదన పంపారు. ఇందులో గాలివీడు, చిన్నమండెం, రాయచోటి, లక్కిరెడ్డిపల్లి, రామాపురం, గుర్రంకొండ, కలకడ , ఖమ్మవారిపల్లి, పీలేరు, టి.సుండుపల్లి, వీరబల్లి, తంబళ్లపల్లి, పెద్దమండెం, కొరకులకోట, పెద్ద తిప్ప సముద్రం, బోరంగి కొత్తపేట, నందలూరు, పెనుగూరు మండలాలు ఉన్నాయి. వైయస్సార్ కడప జిల్లాలో కరువు తీవ్రంగా ఉన్నా ప్రభుత్వం ప్రకటన చేయకపోవడం ఇక్కడి రైతులకు ద్రోహం చేయడమే. బోర్ల కింద సాగవుతున్న అరకొర పంటలు కూడా చేతికి రాని దుస్థితి జిల్లాలో నెలకొంది. జిల్లాలో గత నెల 5 ,6 తేదీల్లో సీపీఐ బృందం పర్యటించింది. ప్రభుత్వం రైతును ఆదుకోవాల్సింది పోయి ఉన్న కరువును కూడా లేదని మభ్యపెట్టేందుకు ప్రయత్నించడం దుర్మార్గం- గాలి చంద్ర, సీపీఐ జిల్లా కార్యదర్శి.

## గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే మొండితోక జగన్మోహన్ రావు





జుజ్జూరు నవంబర్ 3 ప్రజాపాలన ప్రతినిధి ఇటీవల పూర్తి చేసుకున్న గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్ర మం పై మండల పరిధిలోని జుజ్జూరు చెన్నారావు పా లెం నరసింహారావు పాలెం ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశాన్ని స్థానిక ఎమ్మెల్యే మొం డితోక జగన్మోహన్ రావు నిర్వహించారు ఈ కార్యక్ర మంలో భాగంగా ఆయన మాట్లాడుతూగ్రామాల్లో మౌ లిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నాం. ప్రజలు త మ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలకు ప్రాధాన్యమిచ్చి ఆయా పనులకు తీర్మానం చేయించి జీజీఎంపీ ప నుల్లో నిధులు మంజూరు చేయించి త్వరితగతినపూ ర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారుసాంకే తిక కారణాల వలన సంక్షేమ పథకాలు రాలేదని తె లిపిన అర్హుల వినతులను సాధ్యమైనంత త్వరగా ప రిష్కరించాలని అధికారులను ఆదేశించారుప్రజలు అ డిగిన రోడ్లు, డ్రైన్ల, కల్వర్టుల నిర్మాణానికి అవసరమై న అంచనా ప్రణాళికలను. త్వరితగతిన రూపొందించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారుఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## ఏపీ ఫెయిల్యూర్సే... తెలంగాణ ప్రచారాలా..?


విజయవాడ, నవంబర్ 3, :ఏపీలో రోడ్ల దుస్థితి.. భూముల ధరల పతనం ఇవే ఇప్పుడు తెలంగాణలో అధికార బీఆర్ఎస్ కు ప్రచారాస్త్రాలుగా మారిపోయాయి. ఏపీలో రోడ్డెక్కితే మంచాన పడుడే.. తెలంగాణలో ఎకరం అమ్మితే ఇప్పుడు ఆంధ్రాలో యాభై ఎకరాలు కొనొచ్చు, పాలన చేతకాదన్న వాళ్ళే ఇప్పుడు దివాళా తీశారు, తెలంగాణ విడిపోతే చీకటైతది అంటే ఇప్పుడు ఏపీనే అంధకారమైంది, ఏపీలో పనితనం లేదు.. పగ తనమే ఉంది. ఇదీ తెలంగాణ నేతలు ఏపీ పరిస్థితి గురించి మాట్లాడిన, మాట్లాడుతున్న మాటలు. తెలంగాణ సీఎం కేసీఆర్ నుండి ఆ పార్టీ ముఖ్యనేతలు, మంత్రులు హరీష్ రావు, కేటీఆర్ సహా మంత్రులు, నాయకులు అందరూ ఏపీలో ప్రస్తుత పరిస్థితులు, సీఎం జగన్ మోహన్ రెడ్డి పాలనా వైఫల్యాలు, అధఃపాతాళానికి పడిపోయిన అభివృద్ధి, వైసీపీ ప్రభుత్వ కక్షసాధింపులను ప్రస్తావిస్తూ ఏపీని అవహేళన చేస్తూ వ్యాఖ్యలు చేశారు. చేస్తున్నారు. సాధారణంగానే తెలంగాణ అభివృద్ధి సూచికగా ఏపీలో దిగజారిన పరిస్థితులను చూపే బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు ఎన్నికల సమయం కాబట్టి దీన్ని ఇంకా ఎక్కువ చేశారు. బీఆర్ఎస్ నేతలు జగన్ సర్కార్ వైఫల్యాలనే తమ పార్టీ ప్రచార అస్త్రాలుగా ఉపయోగించుకుంటున్నారు. ఏపీలో రోడ్ల నుండి వ్యవసాయానికి అందని చేయూత వరకూ ప్రతిదీ బీఆర్ఎస్ నేతలు తమకి అనుకూలంగా వాడేసుకుంటు న్నారు. నిజానికి బీఆర్ఎస్ నేతలకు ఏపీ ప్రస్తావన లేకుండా ఏ ఎన్నికలు పూర్తికావు. ఒకవైపు ఆంధ్రా పాలకుల పెత్తనంలో అన్యాయం అయిపోయామని కొందరు తెలంగాణ వాదాన్ని తెరపైకి తెస్తే.. ఎన్టీఆర్, చంద్రబాబు లాంటి వాళ్ళు తెలంగాణ సంక్షేమం, హైదరాబాద్ అభివృద్ధిలో కీలకమైన వ్యక్తులని మరికొందరు ఎన్నికలవేళ ఆంధ్ర సెటిలర్లను ఆకట్టుకొనే పనిచేస్తుంటారు. ఇప్పుడు తెలంగాణలో ఎన్నికల సమయంలో తెలుగుదేశం అధినేత చంద్రబాబు అక్రమ అరెస్టుపై దాదాపుగా అన్ని పార్టీల నేతలు సానుభూతి వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలైతే వెళ్లిన ప్రతిచోటా ఏపీలో కుంటుపడిన అభివృద్ధి, దిగజారిన పరిస్థితులను చూపెడుతూ బీఆర్ఎస్ కు ఓటెయ్యకపోతే మీ పరిస్థితి కూడా ఇంతే అంటూ ప్రజలను హెచ్చరిస్తున్నారు. సీఎం కేసీఆర్ స్వయంగా ఈ తరహా వ్యాఖ్యలు చేస్తూ సీఎం జగన్ పరిపాలన వైఫల్యాన్ని తమ పరిపాలన సామర్థ్యానికి కొలమానంగా చిత్రీకరించి చెప్పుకుంటున్నారు. తాజాగా ఖమ్మం జిల్లాలో పర్యటించిన సీఎం కేసీఆర్.. ఏపీలో పరిస్థితులపై చాలా చులకనగా మాట్లాడారు. బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి గురించి తాను ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదనీ, మనం ఎవరితో విడిపోయామో వాళ్లే చెబుతున్నారని అన్నారు. అవతలివాళ్ల రోడ్లు ఎలా ఉన్నాయో.. మన రోడ్లు ఎలా ఉన్నాయో చూస్తే చాలు. నేను ఎక్కువ చెప్పాల్సిన పనిలేదు.. మీరు రోజూ రాకపోకలు సాగిస్తుంటారు కదా! డబుల్ రోడ్ వచ్చిందంటే తెలంగాణ.. సింగిల్ రోడ్ వచ్చిందంటే అది ఆంధ్రా అనేది మీకు కనిపిస్తుంది అంటూ వ్యాఖ్యానించారు. అంతే కాదు ఉమ్మడి రాష్ట్ర చివరి సీఎం కిరణ్ కుమార్ రెడ్డి అప్పుడు రాష్ట్రం విడిపోతే తెలంగాణ కటిక చీకటి అవుతుందన్నారు. కారు చీకట్లు కమ్ముకుంటాయన్నారు. ఇవాళ తెలంగాణలో వెలుగుజిలుగులు ఉంటే.. ఎవరైతే మనకు శాపం పెట్టారో వాళ్లే చీకట్లో ఉన్నారన్నారు. తాము విడిపోతే.. రాష్ట్రాన్ని పాలించటం వస్తుందా? అంటూ వ్యాఖ్యానించారని.. ఇప్పుడు వాళ్లే వచ్చి మన దగ్గర ధాన్యం అమ్ముకుంటున్నారన్నారు. మన రాష్ట్రంలో ధాన్యం అమ్మితే సొమ్ము త్వరగా ఇస్తున్నాం. అందుకే వాళ్లు ఇక్కడికి వచ్చి అమ్ముకుంటున్నారని చెప్పారు. ఇది ఒక్క కేసీఆర్ మాత్రమే కాదు గత వారం మంత్రి హరీష్ రావు కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. ఏపీలో పని తనం లేదని కక్షసాధింపు పాలన సాగుతుందని వ్యాఖ్యానించారు. ఈ తరహా వ్యాఖ్యలు వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపడమే అనడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే బీఆర్ఎస్ నేతలు ఎంతగా జగన్ పాలనను చులకన చేసి మాట్లాడుతున్నా.. వ్యాఖ్యలు చేసినా వైసీపీ నేతలలో చలనం ఉండడం లేదు. తాజాగా సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను, బీఆర్ఎస్ మంత్రులు, నేతలు ఏపీలో జగన్ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపుతూ ఇక్కడి పరిస్థితులపై చేస్తున్న వ్యాఖ్య లు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. చంద్రబాబు లాంటి నాయకుడిని కాదనుకోవడం వలన రాష్ట్రానికి జరిగిన నష్టం ఇదని.. ఓ అసమర్ధుడిని ముఖ్యమంత్రి చేయడం వలన పొరుగు రాష్ట్రాలలో మనం పరువు పోతుందని నెటిజన్లు సోషల్ మీడియాలో చేస్తున్న కామెంట్లు, పెడుతున్న పోస్టులు వైరల్ అవుతున్నాయి. పొరుగు రాష్ట్రం ముఖ్యమంత్రి ఎంత అవహేళనగా జగన్ సర్కార్ వైఫల్యాలను విమర్శించినా.. వైసీపీ నేతలు, ప్రతి విషయానికీ మీడియా ముందుకు వచ్చి తనదైన స్టైల్ లో భాష్యం చెప్పే సకల శాఖల మంత్రి, ప్రభుత్వ సలహాదారు సజ్జల నోటి వెంట కూడా ఈ కామెంట్లను ఖండిస్తూ ఒక్క మాట కూడా బయటకు రావడం లేదు. అంటే బీఆర్ఎస్ నేతలు చెబుతున్న ప్రతి మాటా, చేస్తున్న ప్రతి వ్యాఖ్యా నిజమేనని అంగీకరించినట్లేనా అని పరిశీలకులు ప్రశ్నిస్తున్నారు.

## ఓటిటిలో స్ట్రీమింగ్ కి వచ్చేసిన "మ్యాడ్"




యంగ్ అండ్ టాలెంటెడ్ నటులు నార్నె నితిన్, రామ్ నితిన్ అలాగే మరో యంగ్ టాలెంట్ సంగీత్ శోభన్ లు నటించిన రీసెంట్ యూత్ ఫుల్ హిట్ చిత్రం "మ్యాడ్". మరి దర్శకుడు కళ్యాణ్ శంకర్ తెరకెక్కించిన ఈ చిత్రం యూత్ ని ఆకట్టుకొని పెద్ద హిట్ అయ్యింది. వసూళ్ల పరంగా కూడా అదరగొట్టిన ఈ చిత్రం అయితే ఇప్పుడు ఫైనల్ గా ఓటిటి లో ఎంటర్టైన్ చేయడానికి నేటి నుంచి వచ్చేసింది. మరి ఈ చిత్రం స్ట్రీమింగ్ హక్కులు దిగ్గజ స్ట్రీమింగ్ యాప్ నెట్ ఫ్లిక్స్ వారు సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. మరి ఈ స్ట్రీమింగ్ ప్లాట్ ఫామ్ లో అయితే ఈరోజు నుంచి ఈ మ్యాడ్ ఎంటర్టైనర్ స్ట్రీమ్ అవుతుంది. మరి అప్పుడు మిస్ అయిన వారు అయితే ఇప్పుడు ఈ చిత్రాన్ని చూసి ఎంజాయ్ చేయవచ్చు. ఇక ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించగా సితార ఎంటర్టైన్మెంట్స్ మరియు ఫార్చ్యూన్ 4 సినిమాస్ వారు నిర్మాణం వహించిన సంగతి తెలిసిందే.

## హిట్ మూవీ సీక్వెల్ ఉంది..




కార్తీ హీరోగా 2019 సంవత్సరం లో వచ్చిన ఖైదీ సినిమా ఎంతటి విజయాన్ని సొంతం చేసుకుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఆ సినిమా తోనే దర్శకుడు లోకేష్ కనగరాజ్ కి మంచి గుర్తింపు లభించింది. తమిళ్, తెలుగు సినిమా ఇండస్ట్రీలోనే కాకుండా పాన్ ఇండియా రేంజ్ లో దర్శకుడు లోకేష్ కనగరాజ్ కి భారీ మార్కెట్ క్రియేట్ అయింది. ఖైదీ సినిమా విడుదల అయినప్పటి నుంచి కూడా సీక్వెల్ గురించి చర్చ జరుగుతూనే ఉంది. లోకేష్ కనగరాజ్ నుంచి విక్రమ్ మరియు లియో సినిమాలు రావడంతో ఖైదీ 2 పై మరింత ఆసక్తి అంచనాలు పెరుగుతున్నాయి. లియో సినిమా ప్రమోషన్ సమయంలో ఖైదీ 2 కి అంతా రెడీగా ఉంది అన్నట్లుగా దర్శకుడు వ్యాఖ్యలు చేసిన విషయం తెల్సిందే. ఖైదీ 2 సినిమాకు ముందు దర్శకుడు రజినీకాంత్ సినిమాను ముగించాల్సి ఉంది అంటూ హీరో కార్తీ తాజా ఇంటర్వ్యూలో వ్యాఖ్యలు చేశాడు. ఆయన హీరోగా నటించిన జపాన్ విడుదలకు రెడీ అవుతోంది. ఆ సినిమా ప్రమోషన్ లో భాగంగా దర్శకుడు కార్తీ మీడియాతో మాట్లాడుతూ ఖైదీ 2 గురించి క్లారిటీ ఇచ్చాడు. ఖైదీ 2 సినిమా విషయమై లోకేష్ కనగరాజ్ మనసులో ఉంది. మా ఇద్దరి కాంబోలో ఆ సినిమా రాబోతుంది. అయితే ఇప్పటి వరకు స్క్రిప్ట్ వర్క్ జరగలేదు. లోకేష్ తన తదుపరి సినిమాను రజినీకాంత్ తో చేయబోతున్నారు. ఆ సినిమా తర్వాత మాత్రమే ఖైదీ 2 సినిమా ను ఆయన మొదలు పెడతాడు అంటూ కార్తీ అన్నాడు. రజినీకాంత్ తో సినిమా ను ముగించిన తర్వాత మాత్రమే ఖైదీ 2 సినిమా యొక్క స్క్రిప్ట్ వర్క్ ను మొదలు పెట్టే అవకాశాలు ఉన్నాయి. లోకేష్ సినిమాటిక్ యూనివర్స్ లోని ఎన్నో పాత్రలను ఖైదీ 2 లో చూపించబోతున్నాడు. అంతే కాకుండా విక్రమ్ 2 మరియు లియో 2 సినిమాకు సంబంధించిన లీడ్స్ ను కూడా ఖైదీ 2 లో ఇచ్చే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. అందుకే ఖైదీ 2 పై అంచనాలు ఆకాశాన్ని తాకేలా ఉన్నాయి.

## హీరోయిన్ కుటుంబానికి గుండెపోటు చరిత్ర



సుస్మితా సేన్ పరిచయం అవసరం లేదు. మిస్ యూనివర్స్ 1994 టైటిల్‌ని గెలుచుకోవడం ద్వారా అంతర్జాతీయ గుర్తింపు పొందిన భారతీయ నటి కం మోడల్. అంతకు ముందు.. కేవలం 18 సంవత్సరాల వయస్సులో ఫెమినా మిస్ ఇండియా పోటీని కూడా గెలుచుకుంది. ఈ పోటీలలో ఆమె విజయం సాధించిన తరువాత నట వృత్తిని కొనసాగించింది. ఇటీవల సుస్మితా సేన్ పాపులర్ మీడియా లీడర్‌షిప్ సమ్మిట్ 2023లో జరిగిన సంభాషణలో కొన్ని ఆశ్చర్యకరమైన విషయాలను సుస్మితా సేన్ షేర్ చేసారు.తన కుటుంబ చరిత్రలో గుండె జబ్బుల కారణంగా ప్రతి సంవత్సరం ద్వివార్షిక చెకప్‌లు చేయించుకునేవారని సుస్మిత వెల్లడించింది. అయితే ఈ సంవత్సరం ప్రారంభంలో జైపూర్‌లో తన %ు% షో 'ఆర్య' షూటింగ్ సమయంలో తనకు గుండెపోటు వచ్చింది. ఆర్య మూడవ సీజన్ ట్రైలర్‌లో మనం చూసే యాక్షన్ సన్నివేశాలు ఆమెకు గుండెపోటు వచ్చిన కొద్దిసేపటికే చిత్రీకరించినవి అని సుస్మిత వెల్లడించారు. సుస్మిత ఈ అనుభవాన్ని ఉత్కంఠభరితం అని అభివర్ణించింది. ఎందుకంటే ఇది నిజమైన రీల్ జీవితాన్ని ఒక ప్రత్యేకమైన మార్గంలో కలిపింది. అంధఃకార పరిస్థితులు ఉన్నప్పటికీ తనకు తెరపై పాత్ర ఆర్య కొత్త ప్రారంభంగా భావించాను అని సుస్మిత ఎమోషనల్ అయ్యారు. తన తల్లిదండ్రులకు గుండె జబ్బుల చరిత్ర ఉందని అందుకే తాను ప్రతి ఆరు నెలలకోసారి చెకప్‌లకు వెళ్లేదానిని అని తెలిపింది. సెట్లో గుండెపోటుకు కేవలం ఆరు నెలల ముందు చివరి చెకప్ జరిగింది. అప్పుడు అంతా బాగానే ఉంది. ఆకస్మిక సంఘటన దిగ్భ్రాంతికి గురి చేసిందని సుస్మిత తెలిపింది. ఈ ఆరోగ్య భయం నుండి తాను నేర్చుకున్న ముఖ్యమైన పాఠాన్ని సుస్మిత నొక్కి చెప్పింది. జీవితానికి అనిశ్చిత గడువు ఉంది. తన జీవితంలో ఇంకా చాలా నెరవేర్చాల్సినవి మిగిలి ఉన్నాయని గుర్తించి, ఎటువంటి శాశ్వత నష్టం లేకుండా భారీ గుండెపోటు నుండి బయటపడేందుకు ప్రేరణ పొందానని తెలిపారు. సుస్మిత ఇటీవల కనిపించిన వెబ్ సిరీస్ 'తాలి'. ఇందులో శ్రీ గౌరీ సావంత్ అనే ట్రాన్స్ జెండర్ మహిళ పాత్రను పోషించింది. 'ఆర్య' సీజన్ 3 నవంబర్ 3న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే ఆర్య3 ట్రైలర్ ఆకట్టుకుంది. సుస్మితా సేన్ నటనకు ప్రశంసలు కురుస్తున్నాయి.

## కార్తీ "జపాన్" మూవీ రన్ టైమ్ లాక్డ్!




కోలీవుడ్ స్టార్ హీరో కార్తీ, డైరెక్టర్ రాజు మురుగన్ దర్శకత్వంలో నటిస్తున్న యాక్షన్ డ్రామా జపాన్. అను ఇమ్మాన్యుయేల్ కథానాయికగా నటించిన ఈ చిత్రం నవంబర్ 10, 2023న గ్రాండ్ రిలీజ్ కానుంది. ఈ చిత్రం ఇప్పటికే సెన్సార్ ప్రక్రియను క్లియర్ చేసింది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ నుండి 13 అభ్యంతరాలతో పాటు 156 నిమిషాల మంచి రన్‌టైమ్ ను కలిగి ఉందని తాజా సమాచారం. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ నిర్మించిన ఈ చిత్రంలో సునీల్, విజయ్ మిల్టన్, కెఎస్ రవికుమార్, సనల్ అమన్, వాగై చంద్రశేఖర్ మరియు ఇతర ప్రముఖ నటులు ప్రముఖ పాత్రలు పోషించారు. ఈ చిత్రానికి సంగీతం జివి ప్రకాష్ కుమార్ స్వరాలు సమకుర్చారు.

## ఫ్యాన్స్ గెట్ రెడీ.. సలార్ అప్డేట్స్ షెడ్యూల్ ఇదే!



రానున్న క్రిస్మస్ సందర్భంగా సలార్ విడుదలకు రెడీ అవుతోంది. ఈ సినిమా భారీ వసూళ్లను అందుకే అవకాశం ఉందని బాక్సాఫీస్ పండితులు అంచనా వేస్తున్నారు. అయితే విడుదల తేదీ దగ్గర పడుతున్నా.. ఈ సినిమా ప్రమోషన్స్ ఇప్పటివరకు ప్రారంభం కాలేదు. తాజాగా ప్రమోషన్స్ గురించి అప్డేట్ షెడ్యూల్ బయటకు వచ్చింది! వివరాల్లోకి వెళితే.. అన్నీ అనుకున్నట్టు జరిగి ఉంటే ప్రభాస్ సలార్ ఇప్పటికే విడుదల అయ్యేది. కానీ కొన్ని టెక్నికల్ ప్రాబ్లమ్స్ వల్ల సినిమా విడుదల తేదీ డిసెంబర్ 22కు వాయిదా పడింది. ఇప్పటివరకు రెండు మూడు పోస్టర్లు, ఓ స్మాల్ గ్లింప్స్‌ను విడుదల చేసి సైలెంట్‌గా ఉన్న మేకర్స్.. ఇప్పుడు విడుదల తేదీ దగ్గర పడడంతో ప్రమోషన్స్‌ను వేగవంతం చేయాలని ప్లాన్ చేస్తున్నారుట.


రీసెంట్‌గా కూడా ప్రమోషన్ కోసం ప్రభాస్ నెల రోజుల పాటు సమయం కేటాయించనున్నట్లు వార్తలు వచ్చాయి. దర్శకుడు ప్రశాంత్ నీల్ కూడా పాన్ ఇండియా లెవెల్‌లో రీచ్ వచ్చేలా అందుకు కావాల్సిన ప్లాన్ చేస్తున్నారని కథనాలు చక్కర్లు కొట్టాయి. అయితే ఇప్పుడు తాజాగా మరో సమాచారం అందింది. సలార్ నుంచి రాబోయే అప్డేట్స్ వివరాలు కొన్ని తెలిశాయి. మొదట ఓ టీజర్‌ను విడుదల చేస్తారని ప్రచారం సాగుతోంది. ఆ తర్వాత ఫస్ట్ సింగిల్‌తో మరింత హైప్ పెంచి.. అనంతరం వరుసగా 5 నుంచి 7 పోస్టర్లను విడుదల చేసి ఫ్యాన్స్‌లో ఖుషి నింపుదామని సన్నాహాలు చేస్తున్నట్లు సినీ వర్గాల నుంచి టాక్ వినిపిస్తోంది. ఒకవేళ ఇదే కనుక నిజమైతే అభిమానులకు పండగనే చెప్పాలి. అసలే ప్రభాస్ సాహో, రాధే శ్యామ్, ఆదిపురుష్ అంటూ మూడు బ్యాక్ టు బ్యాక్ ఫ్లాప్స్ అందుకుని ఉన్నారు. కాబట్టి ఇప్పుడు ప్రభాస్‌కు సలార్ విజయం చాలా కీలకం. అందుకు తగ్గట్టే ఈ చిత్రంపై ప్రస్తుతం దేశవ్యాప్తంగా సినీప్రియుల్లో భారీ హైప్ నెలకొంది. చూడాలి మరి ఈ సినిమా అంచనాలను అందుకుంటుందో లేదో.. ఇకపోతే ఈ సినిమాకు పోటీగా అదే సమయంలో బాలీవుడ్ బాద్‌షా షారుక్ డంకీ కూడా రాబోతుంది.

## పొలిమేర 2.. టార్గెట్ ఎన్ని కోట్లంటే



కమెడియన్‌గా నవ్విస్తూనే మంచి పాత్రలతో నటుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు సత్యం రాజేశ్. అలా ఆయన ప్రధాన పాత్రలో గతంలో నటించిన చిత్రం మా ఊరి పొలిమేర. కరోనా సమయంలో ఓటీటీ వేదికగా విడుదలై సెన్సేషనల్ హిట్ అందుకుంది. ఇప్పుడు దీనికి సీక్వెల్‌గా ఆయనే ప్రధాన పాత్రలో మా ఊరి పొలిమేర 2 నేడు నవంబర్ 3 థియేటర్లలోకి వచ్చింది. ఇది కూడా మంచి థ్రిల్లింగ్ పాజిటివ్ టాక్‌ను అందుకుంది. ఈ సినిమాకు మంచి బిజినెస్సే జరిగిందని ట్రేడ్ వర్గాలు పేర్కొన్నాయి. ఓవరాల్‌గా బిజినెస్ రేంజ్ రూ. 3.2 కోట్ల నుంచి రూ. 3.5 కోట్ల దాకా ఉంటుందని చెప్పాయి. అంటే ఇప్పుడు ఈ చిత్రం బాక్స్ ఆఫీస్ దగ్గర బ్రేక్ ఈవెన్ టార్గెట్‌ను అందుకోవాలంటే కనీసం రూ. 4 కోట్ల రేంజ్‌కు కాస్త అటూ ఇటూగా షేర్ వసూలు చేయాల్సిన అవసరం ఉంటుంది. బ్రేక్ ఈవెన్ టార్గెట్ ఎంతంటే ఎలాగో మొదటి భాగం ఆడియెన్స్‌కు విపరీతంగా నచ్చడంతో రెండో పార్ట్ కోసం ప్రేక్షకులు దాదాపుగా థియేటర్లకు వచ్చే ఛాన్స్ ఉంటుంది. పైగా ఇప్పుడు సీక్వెల్‌కు పాజిటివ్ రెస్పాన్స్ రావడం బాగా కలిసొచ్చింది. మరింత మంది ఆడియెన్స్ పెరిగి వసూళ్లు బాగానే వస్తాయి అని చెప్పొచ్చు. ఈ లెక్కన చూస్తే.. మా ఊరి పొలిమేర 2 బ్రేక్ ఈవెన్ మార్క్‌ను అందుకుంటుందనే చెప్పాలి. చూడాలి మరి ఏం జరుగుతుందో.. ఈ హారర్ థ్రిల్లర్ చిత్రానికి డాక్టర్ అనిల్ విశ్వనాథ్ దర్శకత్వం వహించారు. సత్యం రాజేశ్, గెటప్ శ్రీను, కామాక్షిభాస్కర్ల, బాలాదిత్య, రవి వర్మ, చిత్రం శ్రీను, సాహితి దాసరి, రాకెండు మౌళి ప్రధాన పాత్రల్లో నటించారు. జ్యాని, కుశేందర్ రమేశ్ రెడ్డి మంచి సినిమాటోగ్రఫీని అందించారు. శ్రీ క్రిష్ణ క్రియేషన్స్ బ్యానర్‌పై గౌర్ క్రిష్ణ సినిమాను హై వ్యాల్యూస్‌తో నిర్మించారు. రివ్యూ విషయాని కొస్తే. మొదటి భాగానికి దీటుగా రెండో భాగాన్ని తెరకెక్కించారని ఆడియెన్స్ అభిప్రాయపడుతున్నారు. కథనం అత్యుత్తమంగా ఉందని చెబుతున్నారు. స్క్రీన్ ప్లై సూపర్ అని, అనిల్ విశ్వనాథ్ దర్శకత్వం బాగుందంటు మార్కులు వేస్తున్నారు. బీజీఎం కూడా అదిరిపోయింది అంటున్నారు.

## తెలుగు సినిమాలపై ఆసక్తి చూపించని భామ..!



మలయాళ భామ మాళవిక మోహనన్ తెలుగు సినిమాల మీద ఆసక్తి చూపించట్లేదా అంటే అవుననే అంటున్నాయి ఇండస్ట్రీ వర్గాలు. మలయాళంలో కెరీర్ మొదలు పెట్టి తమిళ, కన్నడ సినిమాల్లో చేస్తున్న ఈ అమ్మడు తెలుగులో మొదటి అవకాశం ప్రభాస్ మూవీ అందుకుంది. మారుతి డైరెక్షన్ లో వస్తున్న ఈ ప్రాజెక్ట్ లో మాళవిక మోహనన్ కూడా స్పెషల్ ఎట్రాక్షన్ కానుంది. అయితే తెలుగులో డైరెక్ట్ గా సినిమాలు చేయకపోయినా ఆమె నటించిన సినిమాలు డబ్ అయ్యి తెలుగులో రిలీజ్ అయ్యాయి. అలా తెలుగు ఆడియన్స్ కు దగ్గరైంది మాళవిక. ప్రభాస్ సినిమాతో పాటు కోలీవుడ్ లో విక్రం హీరోగా వస్తున్న తంగలాన్ సినిమాలో కూడా అమ్మడు నటిస్తుంది. రీసెంట్ గా రిలీజైన తంగలాన్ టీజర్ లో మాళవిక లుక్ చూసి ఆమె ఫ్యాన్స్ షాక్ అయ్యారు. ఫోటో షూట్ లో తన గ్లామర్ తో మెప్పిస్తూ వచ్చిన మాళవిక తంగలాన్ లో డీ గ్లామర్ రోల్ లో సర్ ప్రైజ్ చేస్తుంది. ప్రభాస్ సినిమాలో నటిస్తుందని తెలిసి టాలీవుడ్ దర్శక నిర్మాతలు ఆమెకు అవకాశాలు ఇస్తా అంటున్నా మాళవిక మాత్రం నో అనేస్తుందట. ప్రభాస్ సినిమా రిలీజ్ అయ్యాక చేస్తా అని కొందరికి చెబుతుంటే.. రెమ్యునరేషన్ ఎక్కువ డిమాండ్ చేస్తుందని టాక్. తెలుగులో పాన్ ఇండియా సినిమాల మీద అమ్మడి ఫోకస్ ఉందని తెలుస్తుంది. అందుకే మాళవిక మరో తెలుగు సినిమాకు సైన్ చేయలేదు. ప్రభాస్ సినిమా రిలీజ్ అయ్యాకే నెక్స్ట్ తెలుగు సినిమా చేయాలి అప్పుడైతేనే తన రేంజ్ కి తగిన ఛాన్స్ వస్తుందని భావిస్తుంది మాళవిక. సినిమాలు ఎలా ఉన్నా అమ్మడు ఫోటో షూట్స్ మాత్రం నెక్స్ట్ లెవెల్ లో ఉంటున్నాయి. సౌత్ లో సోషల్ మీడియా ఫాలోయింగ్ లో అదరగొట్టే భామల్లో మాళవిక మోహనన్ ఒకరు. అయితే ఫోటో షూట్స్ మాత్రమే కాదు సినిమాలతో కూడా తన సత్తా చాటాలని కోరుతున్నారు ఆమె ఫాలోవర్స్. మిగతా భామలంతా కూడా తెలుగులో ఛాన్స్ లు వస్తే బాగుంటుందని కోరుతుంటే మాళవిక మాత్రం ఇక్కడ దర్శక నిర్మాతలు ఆమె వెంట పడుతున్నా సరే కాదని చెప్పేస్తుంది. ప్రభాస్ సినిమా మీదే తన ఆశలన్నీ పెట్టుకున్న మాళవిక ఆ సినిమాతో తన కెరీర్ గ్రాఫ్ పెంచుకుంటుందా లేదా అన్నది చూడాలి. స్టార్ హీరోయిన్ మెటీరియల్ అయినా అమ్మడు వచ్చిన అవకాశాలను కాదని చెప్పడం వల్లే రేసులో మాళవిక వెనుకబడి ఉందని చెప్పుకుంటున్నారు.



Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printed & published at Unyted Publications, From H.no: #50-61,-3, Rajendra Nagar, Seethampet, Visakhapatnam-16. and SREE SESHASAI ENTERPRISES "D.NO : 3-88, "C/O CHANDRA THEATER," GOSALA VILLAGE, "MAIN ROAD, PENAMALURU MANDAL, KRISHNA DT, ANDHRAPRADESH, India. Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com
PIN: 521151."MOBILE :9912333140 Email : sreeseshasaivja@gmail.com.